

పశు బీమా.. పశువుల కొనుగోలుకు క్రెడిట్ కార్డులు.. తది తరాలతో పాడి పోషణను ప్రోత్సహించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 2019కు ముందు ఉన్న సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేసి పాడి పోషణకు పూర్వ వైభవం తెచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అత్యంత నిర్లక్ష్యానికి గురైన రంగాల్లో పాడి పోషణ కూడా ఒకటి. సేద్యం చేసే ప్రతి రైతులకు, వారి కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉంటుందనే ఉద్దేశంతో పశు పోషణ తరతరాల నుంచి వస్తోంది. అయితే వ్యవసాయ రంగాన్ని కుదేలు చేసిన జగన్ ప్రభుత్వం అదే వైఖరిని పాడి పరిశ్రమపైన కూడా అవలంభించి పోషకుల నడ్డి విరిచింది. అన్ని విధాలుగా కుదేలైన పాడి రైతులను ఆదుకుని తిరిగి ఆ రంగానికి జవసత్వాలు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా పశు బీమా రాయితీ సొమ్ము అందించి ప్రోత్సాహకం కల్పించనుంది. పశు కిసాన్ క్రెడిట్ కార్డుల జారీకి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి పాడి రైతులకు ఆర్థికంగా అండగా ఉండాలని ప్రభుత్వం సంకల్పించింది.

పాడికి.. పూర్వ వైభవం





- పోషకుల సంక్షేమంపై దృష్టి
- పశు బీమాతో పాటు క్రెడిట్ కార్డుల జారీ
- 2019కు ముందు సంక్షేమ పథకాల అమలు
- పోషకులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ చర్యలు
- ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన రంగం

బాపట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో పాడి రైతులు నిర్లక్ష్యానికి గురయ్యారు. పశు పోషణ.. పోషకుల గురించే జగన్ ప్రభుత్వం ఆలోచన చేయలేదు. పైగా గత ప్రభుత్వాలు అమలు చేసిన ఎన్నో పథకాలను వైసీపీ పాలకులు కొనసాగించలేదు. 2019కు ముందు ఉన్న వివిధ పథకాలను రద్దుతో పాటు పెండింగ్ బిల్లుల చెల్లింపు విషయంలో కాలయాపన చేసి పాడి రైతులను నాటి పాలకులు వేధించారు. మినీ గోకులాలు మొదలుకుని సబ్సిడీపై అందించే దాణాను సైతం ఎత్తివేసి పాడి రైతులకు నష్టం చేకూర్చింది. పశుబీమా కోసం ఏళ్ల తర బడి కార్యాలయాల చుట్టూ తిరిగిన పోషకులు విసిగి వేసారిపోయారు తప్పితే గత ప్రభుత్వం కరుణించిన దాఖలాలు లేవు. ఇలా గత వైసీపీ పాలనలో అనేక ఇక్కట్లకు గురైన పాడి రైతులు కాలూ చేయి కూడ దీసుకుని అడుగులేసేలా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. దానిలో భాగంగా పశునష్ట పరి హారం స్థానంలో పాడిరైతులకు పశుబీమా పథకాన్ని అమల్లోకి తెచ్చింది. సేద్యంతో సమానంగా విరాజిల్లే పశుపోషణపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న పాడి రైతులకు మేలు జరగనుంది. పాడి పరిశ్రమకు పూర్వ వైభవం తెచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. బీమా డబ్బుల కోసం ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగే దురవస్థకు చెల్లుచీటి పడనుంది. పశువులు మరణించిన రోజుల వ్యవధిలోనే బీమా పరి హారాన్ని సదరు పాడి రైతు ఖాతాలో జమ చేయడంతో ప్రభుత్వం వహించిన నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. పశువులకు సైతం ఓ షెల్టర్ ఉండాలనే సదుద్దేశంతో మినీగోకులాలకు 2019కు ముందు టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని అటకెక్కించడమే కాకుండా దాదాపు రెండు కోట్ల వరకు బిల్లులను పెండింగ్‌లో ఉంచింది. 50 శాతం రాయితీతో ఇచ్చే దాణా విషయం లో కూడా వైసీపీ ప్రభుత్వం మొండి చెయ్యి చూపింది.

పాటు పశువులను కొనుక్కోవడా నికి మరింత అండగా ఉండడానికి కిసాన్ క్రెడిట్ కార్డులను ఇచ్చే కార్యక్రమానికి పశు సంవర్థక శాఖ శ్రీకారం చుటింది. పశుబీమా కోసం చెల్లించే మొత్తంలో ఎస్సీ, ఎస్టీలకు 80 శాతం, మిగిలిన వారికి 50 శాతం రాయితీ అందించేలా మార్గ దర్శకాలు విడుదల చేసింది. పశువులకు రూ.15,000, అదే మేలుజాతి వాటికైతే రూ.30,000లకు ప్రభుత్వం బీమా చేస్తోంది. ఇంతకంటే ఎక్కువ సొమ్ముకు అదనంగా పాడి రైతు తన పశువులకు బీమా చేసుకోవా లని భావిస్తే అదనంగా అయ్యే మొత్తాన్ని పోషకులే భరించాలని మార్గ దర్శకాల్లో పేర్కొన్నారు. పశుబీమా పథకంలో భాగంగా జిల్లా ల వారీగా రాయితీ సొమ్మును కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బాపట్ల జిల్లా కు సంబంధించి రూ.11 లక్షలను కేటాయిం చగా ఇప్పటికే రూ.25,000 రాయితీ కోసం ఖర్చు పెట్టారు. పల్నాడు జిల్లాకు రూ.15 లక్షలు కేటాయించగా ఇందులో రూ.60,000 బీమా కోసం వెచ్చించారు. గుంటూరు జిల్లాకు రూ.5.50 లక్షలు కేటాయించగా ఇందులో పదివేల వరకు ఖర్చుపెట్టి పాడి రైతులకు భరోసా కల్పించే చర్యలకు శ్రీకారం చుట్టారు. పాడి పశువుల చెవిపోగుకు బీమా ట్యాగ్ పడిపోయినా సమీపంలోని పశుసంవర్థకశాఖ కార్యాలయంలోని సిబ్బంది ద్వారా దానిని తిరిగి వేయించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. పశువు మరణించిన వెంటనే సిబ్బందికి సమాచారం ఇవ్వడం ద్వారా పరిహారాన్ని రోజుల వ్యవధిలోనే పొందే వీలుంటుంది.

క్రెడిట్ కార్డులు జారీ ఇలా..

పశుపోషణకు పాడి రైతులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పశు కిసాన్ క్రెడిట్ కార్డులను అందుబాటులోకి తెచ్చింది. వీటికి సంబంధించి బాపట్ల జిల్లాలో 7,700 కార్డులను అందించాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటికి 8,200 కార్డులు మంజూరు చేశారు. గుంటూరు జిల్లా లక్ష్యం 17,000 కాగా 9,000 వరకు జారీ చేశారు. పల్నాడు జిల్లాలో 18,500 కార్డులకు 13,000 కార్డులను



పాడి రైతులకు అందించారు. ఈ కార్డుల ద్వారా పాడి రైతు ఒక్కొక్కరికి బ్యాంకులు రూ.1.60 లక్షల వరకు రు ణం మంజూరు చేస్తాయి. నగదు అవసర మైనప్పుడు క్రెడిట్ కార్డు ద్వారా డ్రా చేసి వా డుకోవచ్చు. ఖర్చు చేసిన సొమ్మును 40 రోజుల్లోగా తిరిగి చెల్లిస్తే ఎటువంటి వడ్డీ ఉండదు. అదే 40 రోజులు దాటితే 7 శాతం వడ్డీని బ్యాంకులు వసూలు చేస్తాయి. ఇందులో 3 శాతం వడ్డీని ప్రభుత్వమే భరించనుం డగా మిగిలిన 4 శాతాన్ని పాడి రైతు చెల్లించాల్సి ఉంటుంది.

గతంలో మొక్కుబడి తంతుగా..

పశువులు, గొర్రెలు, మేకలు మరణిస్తే నష్టపోయిన పోషకులకు అండగా నిలవడానికంటూ 2019లో వైసీపీ ప్రభుత్వం పశునష్ట పరిహార పథకాన్ని అమల్లోకి తెచ్చింది. తొలి ఏడాదిలో బీమా డబ్బులు సకాలంలోనే అందించిన ప్రభుత్వం అక్కడ నుంచి గద్దె దిగేవరకు దానిని మొక్కుబడి తంతుగానే మార్చింది. డబ్బులు చెల్లించే విషయంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వైసీపీ చివరి నాలుగేళ్ల పాలనలో 3,800 పాడి పశువులు మృతి చెందితే కేవలం 500 పశువులకు మాత్రమే పరిహారం అందింది. ఇది గత



- ఆందోళనకరంగా వింత జ్వరాలు
- ఇంటింటా వైరల్ ఫీవర్ బాధితులు
- పలు ప్రాంతాల్లో పెద్దసంఖ్యలో డెంగీ కేసులు
- వర్షాల అనంతరం వాతావరణంలో విపరీత మార్పులు
- అంతుపట్టని లక్షణాలతో తలలు పట్టుకుంటున్న వైద్యులు

పర్చూరు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

కాక్‌టెయిల్.. వైరస్

జ్వరం తగ్గాక విపరీతమైన దగ్గు.. కొందరిలో వైరల్ హెపటైటిస్ లక్షణాలు.. మరికొందరిలో డయేరియా లక్షణాలు.. ఇంకొందరిలో శ్వాస సంబంధమైన స్వైన్‌ఫ్లూ లక్షణాలు.. పలువురిలో ప్లేట్‌లెట్లు తగ్గిపోతూ డెంగీ లక్షణాలు.. బాధితుల్లో కీళ్ల నొప్పులతో చికున్ గున్యా లక్షణాలు.. విరేచనాలు, వికారం వంటి అతిసార లక్షణాలు.. ఇలా అంతుబట్టని జ్వరాలతో బాధితులు అల్లాడిపోతుండగా.. అర్థంకాని వైరస్ లక్షణాలతో వైద్యులు తలలుపట్టుకుంటున్నాయి. వాతావరణంలో పలు రకాల వైరస్‌లు కలిసి(వైరస్ కాక్‌టెయిల్) కనిపిస్తున్నట్లు వైద్య వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. రోగుల్లో కనిపిస్తున్న లక్షణాలతో ఇవి ఎటువంటి జ్వరాలో అర్థం కాక వైద్యులు కూడా కలవరపడుతున్నారు. ఇన్‌ఫ్లుయెంజా, వైరల్ ఫీవర్, డెంగీ, చికున్ గన్యా, డయేరియా, స్వైన్‌ఫ్లూ వంటి పలు రకాల రోగ లక్షణాల బాధితులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడిపోతున్నాయి.

గుంటూరు(మెడికల్)/ బాపట్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, ముంచెత్తిన వరదలతో అల్లాడిపోయిన ప్రజలను ప్రస్తుతం జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా అంతుబట్టని జ్వరాలు విజృంభిస్తున్నాయి. విష జ్వరాలతో అల్లాడుతున్నారు. వాతావరణంలో వింత వైరస్‌లు ప్రవేశించాయి. వీటి ప్రభావంతో రోగుల్లో పలు రకాల వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయి. ప్రబలుతున్న వింత జ్వరాలు దోమల ద్వారా వస్తున్నాయా? కలుషిత నీరు, ఆహారం ద్వారా సంక్రమిస్తున్నాయా? లేక ఒక రోగి నుంచి మరొక రోగికి గాలి తుంపర్ల ద్వారా(డ్రాప్‌లెట్ ఇన్‌ఫెక్షన్స్) వస్తున్నాయా? అనేది అంతు బట్టడం లేదు. మొత్తం మీద జిల్లావాసులను వైరల్ ఫీవర్లు వణికిస్తున్నాయి. ఇంట్లో ఒకరు వైరల్ ఫీవర్ బారిన పడితే.. ఇంటిల్లిపాదీ జ్వరాల బారిన పడుతున్నారు. ఇన్‌ఫ్లుయెంజా, వైరల్ ఫీవర్, డెంగీ, చికున్ గన్యా, డయేరియా, స్వైన్‌ఫ్లూ వంటి పలు రకాల రోగ లక్షణాలు రోగుల్లో కనిపిస్తున్నాయి. ఇవి ఎటువంటి జ్వరాలో అర్థం కాక.. వైద్య వర్గాలు తలలు పట్టుకుంటున్నాయి. అడుగంటిన పారిశుధ్యం, దోమల కారణంగా వైరల్ జ్వరాలు ప్రబలుతున్నా అధికారుల్లో చలనం లేకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీజనల్ జ్వరాలకు తోడు ఇటీవల వాతావరణంలో చోటుచేసుకున్న విపరీత మార్పులతో వైరల్ జ్వరాలు తీవ్రమవుతున్నాయి. గుంటూరు నగరం తో పాటు పట్టణాలు, గ్రామాల్లో ఇంటి కొకరు జ్వరం బారిన పడి ఉన్నారంటే ఆశ్చర్యం కాదు. కొన్ని గ్రామాల్లో అయి తే వందల సంఖ్యలో జ్వర పీడితులు ఉన్నారు. తీవ్రతను బట్టి వైద్య శిబిరాలు నిర్వహించాల్సిన యంత్రాంగం ఆ దిశగా కనీస చర్యలు చేపట్టకపోవడంతో జ్వరాలు వ్యాప్తికి కారణంగా ఉంది. జ్వర పీడితులు చాలా మంది డెంగీ భయంతో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

వైద్యుల్లో అయోమయం..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బాధితుల్లో జ్వర లక్షణాలతో వైరల్ హెపటైటిస్-ఏ లక్షణాలు కూడా కనిపిస్తున్నాయి. కొందరిలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కనిపిస్తున్నాయి. రోగులకు జరుపుతున్న వైద్య పరీక్షల్లో ప్లేట్‌లెట్లు తగ్గడం కనిపిస్తోంది. ఇవి వైరల్ ఫీవర్ లక్షణాలు. రోగుల్లో ఈ రెండు లక్షణాలు కనిపించడంతో వైద్యులు కూడా కొంత అయోమయానికి గురౌతున్నారు. కలుషిత నీరు, ఆహారంతో వైరల్ హెపైటిస్ విజృంభిస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నీటి వనరులు కలుషితం కావడం వల్ల హెపటైటిస్ ఏ విజృంభణకు కారణంగా చెబుతున్నారు. ఏది వైరల్ జ్వరమో, ఏదీ హెపటైటిస్-ఏ ఇన్‌ఫెక్షనో తెలియక రోగులు ఆందోళన చెందుతున్నారు. సగటున ప్రతి పది మంది జ్వర పీడితుల్లో కనీసం ఇద్దరిలో హెపటైటిస్ నిర్ధారణ అవుతోంది. గతంలో రోగుల్లో ఈ తరహా లక్షణాలు చూడలేదని వైద్యులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

పడకేసిన పారిశుధ్యం.. కనిపించని వైద్య శిబిరాలు..

ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల ధాటికి పల్లెలతో పాటు పట్టణాల్లోనూ పారిశుధ్యం పడకేసింది. చాలా చోట్ల వరద పోటెత్తడంతో గతంతో పోల్చుకుంటే దోమల విజృంభణ మరింతగా పెరిగింది. పారిశుధ్య పనుల్లో పైపైన వ్యర్థాలు తొలగించడానికి పారిశుధ్య సిబ్బంది పరిమితమవుతున్నారు తప్పితే పూర్తి స్థాయి శ్రద్ధ లోపించింది. దీంతో రాత్రిళ్లే కాకుండా పగలు కూడా దోమల దాడి అధికమవుతోంది. దోమల కారణంగానే అధిక సంఖ్యలో జ్వరాలు ప్రబలుతున్నా నివారణ చర్యలపై మున్సిపాలిటీలు, పంచాయతీలు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇక జ్వరాలతో పల్లెలు, పట్టణాల్లో పలు కాలనీలు పడకేసినా వైద్య శిబిరాల నిర్వహణపై కనీసంగా కూడా వైద్య ఆరోగ్య శాఖ స్పందించడంలేదు. పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు కూడా జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. ఇక ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు అయితే ఇన్, అవుట్ పేషంట్లకు లెక్కేలేదు. రెండు వారాల వ్యవధిలో బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఒక్క ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే 13 వరకు డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదయ్యే డెంగీ కేసులను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య 50కి పైగానే ఉండే అవకాశం ఉంది. గడచిన నెలలో డెంగీ లక్షణాలతో బాపట్ల పరిధిలో ఓ అంగన్వాడీ కార్యకర్త మృతి చెందిన సంగతి తెలిసిందే. డెంగీ, టైఫాయిడ్, మలేరియా లక్షణాలకు సాధారణ జ్వర లక్షణాలతో రోజూ వందల సంఖ్యలో రోగులు ఆస్పత్రుల బాట పడుతున్నారు. బాపట్ల ఏరియా ఆస్పత్రిలో రోజూ దాదాపు 400 వరకు ఓపీలు వస్తుండగా సాధారణ జ్వరాలతో వస్తున్న వారు 80 మంది వరకు ఉంటున్నారు. బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న 43 పీహెచ్‌సీలలో ఇదే పరిస్థితి నెలకొంది.

మాస్క్ తప్పనిసరి..

ప్రబలుతున్న వైరల్ ఫీవర్ల నేపథ్యంలో కొవిడ్-19 సమయంలో పాటించిన విధంగా ప్రజలు కొంతకాలం మాస్కులు ధరించడం, సోషల్ డిస్టెన్సింగ్ పాటించడం ఉత్తమం. దీని వల్ల డ్రాప్‌లెట్ ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది.

- డాక్టర్ ఎస్ రఘు, ప్రభుత్వ ఛాతివ్యాధుల వైద్యశాల సూపరింటెండెంట్, గుంటూరు

విపరీత లక్షణాలు..

మొదట రోగుల్లో మూడు రోజుల పాటు జ్వరం కనిపిస్తోంది. జ్వరంతో పాటు చలి, రోగుల్లో చలిజ్వరం, విపరీతమైన తలనొప్పి, వాంతులు, విరేచనాలు, వికారం వంటి అతిసార లక్షణాలు కనిపిస్తున్నాయి. వారం తర్వాత రోగుల్లో కీళ్ల నొప్పులు, కాళ్లు చేతులు బిగుసుకుపోవడం వంటి చికున్ గున్యా లక్షణాలు కనిపిస్తున్నాయి. కొందరిలో తెల్లరక్త కణాలు, ప్లేట్‌లెట్లు తగ్గిపోతున్నాయి. ఇవి డెంగీ లక్షణాలు. కొందరు రోగుల్లో లివర్ ఎంజైమ్‌లైన బైలిరూబిన్, బైలివర్డిన్‌తో పాటు ఎస్‌జీవోపీ, ఎస్‌జీపీటీ వంటి స్థాయి బాగా పెరిగి ఉండటం కనిపిస్తోంది. ఇవి హెపటైటిస్-ఏ లక్షణాలని వైద్యులు చెబుతున్నారు. మరికొందరిలో శ్వాస సంబంధమైన సమస్యలు, ముక్కు కారడం వంటి ఇబ్బందులు ఎదురౌతున్నాయి. ఇవి స్వైన్‌ఫ్లూ, కొవిడ్ -19 లక్షణాలను పోలి ఉంటున్నాయి. మరి కొంత మంది రోగుల్లో జ్వరం తగ్గిన తర్వాత గంట నుంచి మూడు గంటల పాటు ఆగకుండా దగ్గు వస్తోంది.



గుంటూరులోని నూనె షాపుల్లో ఉన్న డబ్బాలపై ఉన్న లేబుల్స్ పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రవణ్‌కుమార్

వంట నూనెలపై.. విజిలెన్స్

- దుకాణాల్లో డెకాయిడ్ ఆపరేషన్ తనిఖీలు
- గుంటూరు, నరసరావుపేటలో 9 మందిపై కేసులు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 17: రాత్రికి రాత్రి వంట నూనెల ధరలు పెంచేయడంపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వంట నూనెల దుకాణాలపై మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో గుంటూరు, పల్నాడు జిల్లాలో ఏకకాలంలో డెకాయిడ్ ఆపరేషన్ తరహాలో తనిఖీలు జరిగాయి. తొలుత సామాన్య పౌరుల మాదిరిగా విజిలెన్స్ సిబ్బంది నూనెలు కొనుగోలు చేసేందుకు దుకాణాలకు వెళ్లి ధరలు తెలుసుకున్నారు. యజమాని చెప్పే ధరకు, నూనె ప్యాకెట్‌పై ముద్రించిన ధరకు ఉన్న వ్యత్యాసాన్ని పరిశీలించి తనిఖీలు చేపట్టారు. లేబుల్స్, తూకం తదితరాలను పరిశీలించారు. కొంతమంది వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరుపుతుండటం గమనించి వారిపై తూనికలు, కొలతలకు సంబంధించిన కేసులు నమోదు చేయించారు. గోడౌన్లలోని స్టాక్‌ను కూడా అధికారులు పరిశీలించారు. వంట నూనెలు బ్లాక్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని వ్యాపారుల ను అధికారులు హెచ్చరించారు. గుం టూరులో ఐదుగురు, నరసరావు పేటలో నలుగురు వ్యాపారుల పై కేసులు నమోదు చేశారు. మంగళవారం ఉదయం ప్రా రంభమైన దాడులు రాత్రి పొద్దుపో యే వరకు కొనసాగినట్లు తెలిసింది. దాడుల్లో విజి లెన్స్ సీఐలు శ్రీహరిరావు, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు

ప్రకృతి రక్షణతోనే ప్రజల సంరక్షణ

- స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, సెప్టెంబరు 17: ప్రకృతిని రక్షిస్తే అది ప్రజలను సంరక్షిస్తుందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బాపట్ల మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. డీపీవో రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కలెక్టర్‌మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిశుభ్రమైన భారతదేశాన్ని రూపొందించాలన్నారు. స్వచ్ఛాంధ్ర మిషన్ అమలులో ఉన్నందున పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. తడిచెత్తను ఎరువుగా మార్చి తోటల పెంపకానికి వినియోగించాలన్నారు. పొడిచెత్తను రీసైక్లింగ్‌కు పంపించాలన్నారు. తద్వారా పర్యావరణ కాలుష్యం తగ్గించవచ్చని చెప్పారు. చెత్తనిర్వాహణపై ప్రజల్లో అవగాహన కల్పించి, మార్పు తీసుకురావాలన్నారు. పాఠశాలలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులు భూమిలో కలవడానికి 400 ఏళ్ల పడుతుందనే విషయాన్ని ప్రజలు గుర్తించి వాడకాన్ని క్రమేపి పూర్తిగా తగ్గించాలని కోరారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కొరకు ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్లాస్టిక్‌లో ఉండే ఆహారం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. కలుషితమైన నీటిని, ఉప్పు నీటిని శుద్ధజలంగా మార్చి ప్రజలు వినియోగించుకునేలా ఎస్‌టీపీ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ ఎం.శివకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ వై.పిచ్చిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో పులి శరత్‌బాబు, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, డాక్టర్ జి.చార్వాక, టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, సీనియర్ నాయకులు ఇనగంటి గాంధీ, మందపాటి ఆంద్రేయ, పల్లంసరోజిని, కూచిపూడి ఝాన్సీరాణి, షేక్.నజ్మా, చెన్నుపాటి హైమావతి, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

ఉప ఖజానాలో కాసులవేట

- ఆదాయం వచ్చే సీటు కోసం పోరు
- పర్సంటేజీల పంపకాలలో తేడాలే కారణమా

చీరాల, సెప్టెంబరు 17: చీరాల ఉప ఖజానా అధికారుల రూటే సపరేటుగా మారింది. కార్యాలయంలో ఆధిపత్యపోరు సాగుతోంది. పర్సంటేజీల పంపకాలలో తేడా లే ఇందుకు కారణంగా చెప్పుకుంటున్నారు. అన్ని బిల్లులకు, పెన్షన్లకు, అరియర్ బిల్లులకు సంబంధించిన పనులు పూర్తి చేయాలంటే ఒక్కో సీటుకు ఒక్కో రేటు ఉంది. కార్యాలయంలో ఆధిపత్యపోరు అధికారులు, సిబ్బంది మధ్య వర్గపోరుగా మారింది. పాస్ కావాల్సిన బిల్లులు, పెన్షన్లు, అరియర్స్‌కు సంబంధించిన బిల్లులకు మూడు నుంచి ఐదు శాతం మామూళ్లుగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అదనపు ఆదాయం ఎక్కువగా వచ్చే సీటు కోసం సిబ్బంది మధ్య పోటీ పెరిగింది. ఈ నేపథ్యంలో మారిన ఆఫీసు ఆర్డరుతో వివాదాలు రోడ్డెక్కాయి. దీంతో ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి, డీటీవో పరమేశ్వరి విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. బిల్లుల చెల్లింపునకు సంబంధించి ఒక్కో సీటులో పనిచేసేవారిది ఒక్కో విధానమని ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన వారు చెప్తున్నారు. కొందరు పర్సంటేజీ ముందు ఇచ్చినా ఇవ్వకపోయినా ఆపకుండా చేసి ఆ తర్వాత డబ్బు ఇచ్చినా తీసుకుంటారని, మరికొందరు ముందు పర్సంటేజి ఇస్తేనే పని చేస్తారని లేదంటే పెండింగ్ పెడుతుంటారన్నారు. అంతిమంగా కార్యాలయంలో లంచం లేనిదే ఏపని జరగదనేది తెలుస్తుంది.

అధికారులు, సిబ్బంది రాజీ

పర్సంటేజీల విషయం వీధికెక్కడంతో తొలి రోజు విచారణలో ఒకరిపై ఒకరు చేసుకున్న ఆరోపణలతో పలు వాస్తవాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. దీర్ఘకాలంగా ఒక ప్రాంతంలో పనిచేస్తున్నవారు ఆధిపత్యం నెగ్గాలనే పంతంతో ఉన్నట్లు తెలుస్తోంది. కలెక్టర్ ఆదేశాలతో చేపట్టిన విచారణతో తమపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని అధికారులు, సిబ్బంది మల్లగుల్లాలు పడుతున్నారు. ఆ క్రమంలో మంగళవారం అధికారులు, సిబ్బంది మధ్యేమార్గంగా రాజీపడినట్లు సమాచారం.

అవకతవకలు లేకుండా చూస్తాం..



నాకు ఆరోగ్యం సరిగ్గా లేక దీర్ఘకాలం సెలవులో ఉన్నాను. కార్యాలయంలో నెలకొన్న పరిణామాలు, పరిస్థితులకు సంబంధించి ఆఫీస్ ఆర్డరు మార్పు చేసిన మాట వాస్తవమే. కలెక్టర్ ఆదేశాల మేర కు ఆర్డీవో, డీటీవో విచారణ చేపట్టారు. బిల్లులు పెండింగ్ లేకుండా పాస్ చేశాం. ఇకపై ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసుకుంటాం.

- భాగ్యలక్ష్మి, ఎస్టీవో, చీరాల



బృహత్ శిలా యుగం నాటి సమాధులు

ద్రోణాదులలో అన్నదాన శాసనం

- కొండపై 7వ శతాబ్దం నాటి శిలాయుగ సమాధులు

మార్టూరు, సెప్టెంబరు 17: మండలంలోని ద్రోణాదుల గ్రామంలో మరికొన్ని కొత్త శాసనాలు, సమాధులు వెలుగు చూసినట్లు పురావస్తు శాస్త్ర పరిశోధకుడు విద్వాన్‌జ్యోతి చంద్రమౌళి తెలిపారు. మంగళవారం ఆయన గ్రామంలో వెలుగుచూసిన అన్నదాన శాసనాలు, బృహత్ శిలాయుగం నాటి(రాక్షస గూళ్లు) సమాధులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్రోణాదుల గ్రామంలో జరిపిన పరిశోధనలో క్రీ.శ. 1634వ సంవత్సరంలో తంగేడి నాయనింగారు చేయించిన సేవావార అని రాసి ఉన్న శాసనాన్ని గుర్తించినట్లు చెప్పారు. రెండో శాసనంలో హేవళంబ సంవత్సర కార్తీక శుద్ధ పౌర్ణమి సోమవారం శ్రీశైలం, మొదలైన భిక్ష వృత్తి వారికి ద్రోణాదులలోని వీరేశ్వరస్వామి దేవస్థానం ముఖమండపంలో కోటి వీరయ్య, అవఘళ వీరయ్య, కందుకూరి కుమారరాచ విజయనరసయ్యగారు స్వామివారికి వేయించన శాసనం అని రాసి ఉందన్నారు. శ్రీశైలం వెళ్లే భిక్ష వృత్తివారికి నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించాలని ఆ శాసనాలలో ఉన్నట్లు తెలిపారు. కొండపైన క్రీ.పూ. 7వ శతాబ్దం నాటి బృహత్ శిలాయుగం నాటి సమాధులను గుర్తించామన్నారు. వీటి ఆధారంగా ద్రోణాదుల ప్రాంతంలో అప్పటికే జనసంచారం ఉన్నట్లు తెలిస్తుందని చంద్రమౌళి తెలిపారు.



17వ శతాబ్దం నాటి అన్నదాన శాసనాన్ని పరిశీలిస్తున్న పురావాస్తు పరిశోధకుడు జ్యోతి చంద్రమౌళి

దిక్సూచి DIKSUCHI

ఏఐసీటీఈ ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్

మహిళలను సాంకేతిక విద్యలో ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్' నోటిఫికేషన్ వెలువడింది. 'ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)' ఏటా దీనిని ఆఫర్ చేస్తోంది. ఈ స్కీమ్ ద్వారా డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో అర్హులైన అమ్మాయిలకు ఆర్థిక సహకారం అందిస్తారు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో స్కాలర్‌షిప్‌లు: డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో ఒక్కోదానికి 5,000 చొప్పున దేశవ్యాప్తంగా మొత్తం 10,000 స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా నిర్దేశిత కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి దరఖాస్తు చేసుకొన్న విద్యార్థినులందరికీ స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.

- డిప్లొమా కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 318, తెలంగాణకు 206 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.
- డిగ్రీ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 566, తెలంగాణకు 424 స్కాలర్‌షిప్‌లు ప్రత్యేకించారు.

అర్హతలు: డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏదేని టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందిన వారు కూడా అర్హులే.
- పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్: టెక్నికల్ డిప్లొమా రెగ్యులర్ కోర్సు లో చేరినవారికి మూడేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు రెండేళ్లు; టెక్నికల్ డిగ్రీ రెగ్యులర్ కోర్సులో చేరినవారికి నాలుగేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు మూడేళ్లపాటు స్కాలర్‌షిప్ అందిస్తారు. కాలేజ్ ఫీజు, కంప్యూటర్ కొనుగోలు, సాఫ్ట్‌వేర్, స్టేషనరీ, బుక్స్, ఎక్విప్‌మెంట్ తదితరాల నిమిత్తం ఏడాదికి రూ.50,000లు ఇస్తారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) విధానంలో నేరుగా అమ్మాయి బ్యాంక్ ఖాతాకు ఈ మొత్తాన్ని జమ చేస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

SCHOLARSHIP ALERT

Corteva Agriscience Scholarship Program 2024-25

Description: An initiative of Corteva Agriscience Seeds Pvt. Ltd., this program aims to provide financial assistance to meritorious students pursuing postgraduate, doctoral or undergraduate courses in the area of agriculture, as well as students in Classes 11 and 12 with STEM subjects.

Eligibility: Female students in post-graduate (MBA/M.Sc./M.Tech.), doctoral, or undergraduate courses, as well as for those in Classes 11 and 12 with STEM subjects (government/private schools).

The applicant's annual family income must be ?6,00,000 or less.

Students from across India can apply Children of employees of Corteva & Buddy4Study are not eligible.

Prizes & Rewards: For PG students: INR 50,000

For UG students: INR 25,000

For school students: INR 10,000

Last Date to Apply: 30-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/CASP4



Alstom India Scholarship 2024-25

Description: Alstom India is offering this scholarship to provide financial support to students across India to help them pursue their higher education and prevent them from dropping out of college.

Eligibility: Students studying in any year of professional graduation in STEM courses can apply. Applicants must have secured at least 60% marks in their previous academic year/semester.

The annual family income of the applicants must be less than or equal to INR 6,00,000 from all sources. The scholarship is open to students residing in locations such as Chennai (Tamil Nadu), Kolkata (West Bengal), Madhepura (Bihar), Sri City (Andhra Pradesh), or Vadodara (Gujarat).

Prizes & Rewards: Up to INR 75,000 (one-time)

Last Date to Apply: 30-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/AISDG7

Infosys Foundation STEM Stars Scholarship Program 2024-25

Description: An initiative by the Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM courses (Science, Technology, Engineering, Mathematics), Medical Sciences (MBBS), Bachelor of Dental Surgery (BDS), Bachelor of Pharmacy (B.Pharm)!

Eligibility: Applicants must be female students who are citizens of India.

Students must be enrolled in the First year of a 3 year B.Sc Degree (Courses such as Bio-chemistry, Physics, Chemistry, Nursing, Geography, IT, Biology, Computer Science, Forensic Science, etc.)

First or 2nd year of B.Tech, MBBS, B.Pharm, BDS, Integrated Masters, Dual Degree (B.Tech + M.Tech)

Students must be enrolled in institutes listed among the top ranks in the NIRF (National Institutional Ranking Framework) for 2023 or 2024.

Candidates must have obtained admission into the identified colleges and completed their Class 12.

Applicants must have an annual family income of less than or equal to ?8 lakh.

Candidates must not have availed other scholarships for the same expenses.

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to ?1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.

Last Date to Apply: 30-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/ISTS2

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

వెట్రిమారన్ దర్శకత్వంలో నటించాలని ఉంది



ఎన్టీఆర్

తమిళంలో తన అభిమాన దర్శకుడు, జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ దర్శకత్వం వహించే తమిళ స్ట్రైట్ చిత్రంలో నటించి, దానిని తెలుగులోకి అనువదించాలని ఉందని జూనియర్ ఎన్టీఆర్ చెప్పారు. కొరటాల శివ దర్శకత్వంలో జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర' చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం చెన్నైలో విలేకరుల సమావేశం జరిగింది. తమిళంలో స్ట్రైట్ చిత్రం ఎప్పుడు చేస్తారని విలేకరులు ప్రశ్నించగా, అలా సమాధానం చెప్పారు ఎన్టీఆర్. ఈ సమావేశంలో చిత్ర దర్శకుడితో పాటు హీరోయిన్ జాన్వీకపూర్, సంగీత దర్శకుడు అనిరుధ్, కెమెరామెన్ రత్నవేలు, గేయరచయిత రామజోగయ్య శాస్త్రి, తమిళనాడు 'దేవర' చిత్ర పంపిణీదారుడు, నిర్మాత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ మాట్లాడుతూ... చెన్నైతో తనకు చిన్ననాటి నుంచి అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ పునాదులు చెన్నైలో ఉన్నాయని, ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్లిందన్నారు. దేవర చిత్రం ఇంత బాగా రావడానికి ప్రధాన కారణం నటీనటులేనని, ముఖ్యంగా, దర్శకుని విజన్‌లో తెరపై ప్రతిబింబించేలా చేసిన సినిమాటోగ్రాఫర్, ఎడిటర్, సంగీత దర్శకులకు ఆ క్రెడిట్ దక్కుతుందన్నారు. ప్రేక్షకులంతా ఒక్కటేనని బాహుబలి చిత్రం నిరూపించిందని, ఇప్పటివరకు భాషాపరంగా వేరుగా ఉన్నా, సినిమాపరంగా తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం, హిందీ అంతా ఒక్కటేనని నిరూపితమైందన్నారు.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

వర్క్ పేరుతో మైనర్ యువతిపై వేధింపులు

- ఎంక్వయిరీలో దొరికిన ఆధారాలు..
- 90 రోజుల్లోపే నివేదిక
- ప్రెస్‌మీట్‌లో నటి ఝాన్సీ వెల్లడి

నృత్య దర్శకుడు జానీ తనపై చేసిన లైంగిక వేధింపుల గురించి బాధితురాలు చేసిన ఫిర్యాదుపై నార్సింగ్ పోలీసులు ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేసి విచారణ చేపట్టారు. అలాగే టాలీవుడ్ లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్ మంగళవారం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసింది. ఈ ప్యానెల్ ఛైర్‌పర్సన్, నటి ఝాన్సీ , తమ్మారెడ్డి భరద్వాజ దామోదర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఝాన్సీ మాట్లాడుతూ ' ఇద్దరు ప్రముఖ కొరియోగ్రాఫర్స్ మధ్య ఉన్న మేటర్ ఇది. చిత్ర పరిశ్రమ అనేది అన్ ఆర్గనైజ్‌డ్ సెక్టార్. మహిళల రక్షణ కోసం ఇక్కడ సరైన గైడ్‌లైన్స్ లేవు. డిఫరెంట్ వింగ్స్‌లో పరిశ్రమ పని చేస్తుంది కాబట్టి ఏ రకమైన గైడ్ లైన్స్ ఉండాలనేది ప్రభుత్వంతోచర్చించాలి. అయితే తెలుగు చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపులు లేవు అని మేం చెప్పడం లేదు.ఇతర భాషల పరిశ్రమలో ఉన్న సమస్యలు, సెక్సువల్ హరాస్‌మెంట్ ఇక్కడ కూడా ఉంది, ఇద్దరు కొరియోగ్రాఫర్ల మధ్య జరిగిన వ్యవహారం ఇది. వాళ్ల పేర్లు బయట పెట్టదలచుకోలేదు ఒక హయ్యర్ పొజిషన్ లో ఉన్న వ్యక్తి మీద ఆరోపణ వచ్చింది. బాధితురాలు మైనర్‌గా ఉన్న దగ్గర నుంచి పని చేస్తోంది. ఆమె మొదట మీడియా ఛానల్స్‌ను ఎప్రోచ్ అయింది. ఇది మీడియాలో వస్తే చాలా పెద్ద ఇష్యూ అవుతుంది కనుక నువ్వు ఛాంబర్‌కు వెళ్లమని మీడియా వారు భరద్వాజ దగ్గరకి, సుప్రియ దగ్గరకు వెళ్లమని సలహా ఇచ్చారు. పరిశ్రమలో నాకు వర్క్ కావాలి అని ఆమె ఛాంబర్ ముందు వచ్చింది. పని ఇస్తామని చెప్పి వేధిస్తున్నారని వచ్చింది. ఫెడరేషన్ ద్వారా ఛాంబర్ ఆమెకి కార్డు ఇప్పించింది. అయితే కార్డు ఇవ్వడం వెనుక సెక్సువల్ హరాస్‌మెంట్ ఉందనే విషయం ఆమెతో మాట్లాడిన తర్వాత మాకు అర్థమైంది. అయితే సెక్సువల్ హరాస్‌మెంట్ అనేది వర్క్ ప్లేస్‌లో కాదని తెలిసింది. ఆమె కంప్లయింట్ రికార్డ్ చేశాం. ఆ కొరియోగ్రాఫర్ స్టేట్‌మెంట్ కూడా రికార్డ్ చేశాం. వర్క్ పేరుతో ఒక మైనర్ మీద వేధింపులు జరిగాయి. దీని మీద ఎంక్వయిరీ జరుగుతోంది. ఆధారాలు కొన్ని దొరికాయి. గైడ్‌లైన్స్ ప్రకారం మాకు 90 రోజుల గడువు ఉంది. దానిలోపే పని పూర్తి చేసి రిపోర్ట్ ఇస్తాం. వర్క్ ప్లేస్‌లో మహిళలకు భద్రత కల్పించాలనీ, ఇది సురక్షిత ప్రదేశమని నిరూపించాలని మా తపన.' అని చెప్పారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'ఇలాంటి కేసుల కోసమే 2013లో 'ఆసరా' ఏర్పాటు చేశాం. 2018లో ఈ ప్యానెల్ పెట్టాం. పరిశ్రమలో మహిళలు సేఫ్‌గా ఉంటారని చెప్పడానికే ఈ ప్రెస్‌మీట్ పెట్టాం' అన్నారు.



ఫిర్యాదు చెయ్యండిలా : టీఎఫ్‌సీసీ

లైంగిక వేధింపులు ఎదుర్కొన్న వారు ఫిర్యాదు చేయాలని టీఎఫ్‌సీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. హైదరాబాద్ తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫీసు వద్ద ఉదయం 6గంటల నుండి రాత్రి 8 గంటల వరకు కంప్లైంట్ బాక్స్ అందుబాటులో ఉంటుందని పేర్కొంది. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్, డి.రామానాయుడు బిల్డింగ్ కాంప్లెక్స్, ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500096 చిరునామాకు పోస్టుద్వారా అయినా ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. ఫోన్ నంబరు : 98499 72280, మెయిల్ ఐడీ : complaints@telugufilmchamber.in కు కంప్లైంట్స్ ఇవ్వొచ్చని విజ్ఞప్తి చేసింది.

బాధితురాలికి పరిశ్రమ భరోసా



ఈ కేసు తర్వాత ఈ ఫీమేల్ కొరియోగ్రాఫర్ తన పని ప్రశాంతంగా చేసుకోగలగాలి. దీని వల్ల తన జీవితం నాశనం అయిపోతుంది, వచ్చే అవకాశాలు పోతాయి. పరిశ్రమ నుంచి వెళ్లిపోవాల్సి వస్తుంది.. అనే భయం ఆమెకి ఉండకూడదు. ఆ అమ్మాయి టాలెంట్ పరిశ్రమకు తెలుసు. ఈ కేసు ఎటువైపు వెళ్లినా ఆమె టాలెంట్‌కు వచ్చే ఇబ్బంది ఏమీ లేదు. ఆమెకు చిత్ర పరిశ్రమ సపోర్ట్‌గా నిలబడింది. కొంతమంది నిర్మాతలు ఆమెకు అవకాశాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. ఆమె టాలెంట్ తెలిసిన పెద్ద సంస్థ, దర్శకుడు అవకాశం ఇస్తున్నారు. ఒక పెద్ద హీరో తన మేనేజర్ ద్వారా కబురు చేసి ఆమెకు మద్దతు పలికారు. టాలెంట్‌కు పరిశ్రమ నుంచి ఎప్పుడూ సపోర్ట్ ఉంటుంది

-ఝాన్సీ

ఆ ఇల్లు అమ్మక తప్పలేదు

- కంగన



'ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు' అనేది ఒకప్పటి సామెత. దానికి పొడిగింపుగా 'సినిమా తీసి చూడు' అని చేర్చుకోవాల్సి వస్తోంది ఇప్పుడు. ఇందుకు తాజా ఉదాహరణ బాలీవుడ్ నటి. దర్శకురాలు కంగనా రనౌత్. ఆమెకు ముంబైలో బాంద్రా ప్రాంతంలోని పాలీ హిల్ లో ఓ ఖరీదైన బంగ్లా ఉంది. 2017లో రూ. 20 కోట్లకు దీన్ని కొన్నారు కంగనా. నిబంధనలకు విరుద్ధంగా ఉందని 2020లో ఈ బంగ్లాలోని కొంత భాగాన్ని బొంబాయి మున్సిపల్ కార్పొరేషన్ కూల్చివేయడంతో అప్పట్లో కంగనా అధికార పార్టీని తీవ్రంగా విమర్శించారు. ఇప్పుడు అదే బంగ్లాను అమ్మేశారు కంగనా. కారణం.. ఆమె దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'ఎమర్జెన్సీ' సినిమా. జీ స్టూడియోస్‌తో కలిసి ఆమె నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదల కావాలి. కానీ సెన్సార్ సర్టిఫికెట్ రాని కారణంగా విడుదల వాయిదా పడింది. ఇప్పటికే ఆ సినిమా మీద చాలా డబ్బు పెట్టిన కంగనా మిగిలిన ఖర్చుల కోసం బంగ్లాను కూడా అమ్మేశారు. 'నా దృష్టిలో ఆస్తులు అనేవి అవసరం వచ్చినప్పుడు ఆదుకొనేవే. అందుకే బంగ్లా అమ్మేశాను' అని చెప్పారు కంగనా. రూ. 32 కోట్లకు అమ్మకం జరిగిందని సమాచారం.

ఇప్పటికైనా త్రివిక్రమ్‌ను ప్రశ్నించండి

- పూనమ్‌కౌర్




కొరియోగ్రాఫర్ షైక్ జానీ భాష (జానీ మాస్టర్)పై అత్యాచార కేసు టాలీవుడ్‌లో చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నటి పూనమ్ కౌర్ సోషల్‌మీడియాలో పెట్టిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. "నేను గతంలో దర్శకుడు త్రివిక్రమ్‌పై మూవీ ఆర్టిస్ట్స్ అసోషియేషన్ (మా)కు ఫిర్యాదు చేశాను. నా ఫిర్యాదుపై 'మా' చర్యలు తీసుకోలేదు. 'మా' గనక నా ఫిర్యాదును పరిశీలించి ఉంటే.. నాకూ... మరికొంత మందికి ఇబ్బందులు తప్పేవి. రాజకీయంగా కూడా నేను ఇబ్బందులు ఎదుర్కొన్నాను. ఇప్పటికైనా ఇండస్ట్రీ పెద్దలు త్రివిక్రమ్ శ్రీనివాస్‌ను ప్రశ్నించాలని కోరుకుంటున్నాను" అని ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

'మా'లో ఎప్పుడు ఫిర్యాదు చేసిందో తెలీదు

పూనమ్ కౌర్ వ్యాఖ్యలపై దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ స్పందించారు. "పూనమ్ కౌర్ 'మా'లో ఫిర్యాదు ఎందుకు చేశారో.. ఎప్పుడు చేశారో మాకు తెలియదు. అప్పటికి కమిటీ ఏర్పాటై ఉంటే .. ఫిర్యాదు బాక్స్‌లో ఆమె తన కంప్లైంట్‌ను వేసి ఉంటే సరిపోయేది. ఫిర్యాదు లేకుండా ముందుకెళ్లలేం. 'మా' వాళ్లు ఆ ఫిర్యాదును మాకు పంపించి ఉన్నా.. చర్యలు తీసుకునేవాళ్లం. ఇప్పటికైనా ఫిర్యాదు అందిస్తే ముందుకు వెళ్తాం" అని పేర్కొన్నారు.

ఆ గొప్పతనం చాటేలా..



నోయల్, రిషిత నెల్లూరు హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'బహిర్భూమి'. రామ్‌ప్రసాద్ కొండూరు దర్శకత్వంలో మచ్చ వేణుమాధవ్ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మచ్చ వేణుమాధవ్ మాట్లాడుతూ "సినిమా చాలా కొత్తగా ఉంటుంది. ఎంతో ధైర్యంతో చేసిన చిత్రమిది. ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకం ఉంది" అని చెప్పారు. "ఈ సినిమాలో నోయెల్, ఫణి మధ్య వచ్చే కామెడీ సీన్స్ సినిమాకే హైలైట్ అవుతాయి. ఈ సినిమాకు ఈ టైటిల్ ఎందుకు పెట్టామో.. సినిమా చూస్తే తెలుస్తుంది. మన కల్చర్‌లోని గొప్పతనాన్ని చాటే చిత్రమిది" అని దర్శకుడు రామ్‌ప్రసాద్ కొండూరు అన్నారు. "చాలా మంచి చిత్రం చేశాం. ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలు ఇందులో పుష్కలంగా ఉన్నాయి" అని హీరో నోయెల్ తెలిపారు. ఈ సినిమాకు సినిమాటోగ్రఫీ: ప్రవీణ్ కోమరి, సంగీతం: అజయ్ పట్నాయక్.

గ్యాంగ్ గ్యాంగ్ గ్యాంగ్‌స్టర్స్

కథానాయకులు ఒకప్పుడు రాముడు మంచి బాలుడు తరహా పాత్రలు మాత్రమే చేయడానికి ఆసక్తి చూపేవారు. ఆ తర్వాత గ్రే షేడ్స్ ఉన్న పాత్రలకు సైతం సై అని బాక్సాఫీస్‌కు కళ తెచ్చారు. 1970 దశకంలో మొదలైన ఈ హడావుడి. ఇప్పటికీ ఎవర్‌గ్రీన్ ఫార్ములాగా వెండితెరను ఏలుతోంది. డాన్.. గ్యాంగ్‌స్టర్.. బూట్ లెగ్గర్ ఇలా ఎన్ని పేర్లతో ఈ పాత్రలు తెరపైకి వచ్చినా.. కథానాయకులు మాత్రం ఈ రోల్‌లో ఒక్కసారి అయినా కనిపించాలని కోరుకుంటుంటారు. కొందరు కథానాయకులు అయితే ఇదే తరహా పాత్రలకు బ్రాండ్‌గా మారిన సందర్భాలూ అనేకం. అలా త్వరలో వెండితెరపై తళుక్కుమననున్న గ్యాంగ్‌స్టర్ పాత్రధారులెవరో ఓ లుక్కేద్దాం.



సుజీత్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ నటిస్తున్న చిత్రం 'దే కాల్ హిమ్ ఓజీ'. ఇందులో పవన్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. జపాన్..కోల్‌కతా నేపథ్యంలో సాగే ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాపై అంచనాలు ఇప్పటికే పీక్స్‌లో ఉన్నాయి. ఇప్పటికే ఈ సినిమా గ్లింప్స్ విడుదలై సినిమా ఏ రేంజ్‌లో ఉంటుందో ప్రేక్షకులకు హింటిచ్చింది. ఇది వరకే 'బాలు', 'పంజా' చిత్రాలలో పవన్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను మొదట ఈ నెల 27న విడుదల చేయాలనుకున్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా పవన్ ఎన్నికవ్వడం.. ఆయన రాజకీయాలకే ఎక్కువ సమయం కేటాయిస్తుండడంతో ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందనేది దానిపై మేకర్స్ నుంచి అప్‌డేట్ లేదు.

అచ్చొచ్చిన పాత్రలో...

తమిళ నటుడు అజిత్ ఇప్పటివరకూ ఎన్నో పాత్రల్లో కనిపించారు. అయితే, గ్యాంగ్‌స్టర్ పాత్రలతో ఆయన తనకంటూ విశేష గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన ఇప్పటికే 'బిల్లా', 'బిల్లా 2', 'గ్యాంబ్లర్' వంటి పలు చిత్రాల్లో గ్యాంగ్‌స్టర్‌గా కనిపించి మెప్పించారు. ఇప్పుడు అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో ఆయన నటిస్తున్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఇందులోనూ ఆయన గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం నుంచి విడుదలైన పోస్టర్స్ సినిమాలో అజిత్ పాత్రలో ఎన్నో వేరియేషన్స్ ఉంటాయనే హైప్ క్రియేట్ చేశాయి. ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.




ఖురేషీ అబ్రహంగా

మలయాళ నటుడు మోహన్‌లాల్ నటించిన దాదాపు అరడజనుకుపైగా సినిమాల్లో ఆయన గ్యాంగ్‌స్టర్‌గా కనిపించారు. 2019లో పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో మోహన్‌లాల్ నటించిన చిత్రం 'లూసీఫర్'. ఆయన ఇందులో సినిమా మొదటి నుంచి చివరి వరకు స్టీఫెన్ గట్టుపల్లి అనే రాజకీయనాయకుడి పాత్రలో కనిపిస్తారు. సినిమా ఎండ్ క్రెడిట్స్‌లో ఆయన గ్యాంగ్‌స్టర్ ఖురేషీ అబ్రహంగా కనిపించి ప్రేక్షకులను థ్రిల్ చేస్తారు. ఇప్పుడు ఖురేషీ పాత్రపై 'లూసీఫర్‌'కు సీక్వెల్‌గా 'ఎల్ 2 ఎంపురాన్' అనే చిత్రం వస్తోంది. ఎంపురాన్ అంటే రాజుకు ఎక్కువ.. దేవుడికి తక్కువ అనే అర్థం వచ్చేలా తెరకెక్కుతోన్న ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి.



డెడ్లీ డాన్‌గా...


తమిళ సినిమాల్లో డాన్ పాత్రను పోషించాలంటే టక్కున గుర్తొచ్చే నటుల్లో సూపర్‌స్టార్ రజనీ ఒకరు. ఆయన ఇదివరకే 'రంగా', 'బిల్లా', 'బాషా' 'కాలా' 'కబాలి' వంటి చిత్రాల్లో గ్యాంగ్‌స్టర్‌గా అదరగొట్టారు. ఆయన నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'కూలీ'. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వస్తోన్న ఈ సినిమాలో రజనీకాంత్ డెడ్లీ డాన్‌గా కనిపించనున్నారు. గోల్డ్ స్మగ్లింగ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కే ఈ చిత్రంలో నాగార్జున 'సైమన్' అనే విలన్ పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



రోలెక్స్‌గా..

తమిళ నటుడు సూర్య ప్రతీ చిత్రంతో తన వైవిధ్యమైన నటనతో అలరిస్తుంటారు. తను ఎంచుకునే పాత్రల్లో ఎన్నో షేడ్స్ చూపించే ఆయన.. ఇదివరకే 'ఆరు', 'నంద', 'సికందర్' సినిమాల్లో గ్యాంగ్‌స్టర్‌గా కనిపించి రాణించారు. ఇప్పుడు ఆయన లోకేశ్ కనగరాజ్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా.. 'విక్రమ్' సినిమా క్లైమాక్స్‌లో 'రోలెక్స్'గా కనిపించిన సంగతి తెలిసిందే. ఆయన తెరపై కనిపించింది ఐదు నిమిషాలే అయినా.. ఆ కొద్దిసేపటికే థియేటర్లు 'రోలెక్స్'.. 'రోలెక్స్' అంటూ దద్దరిల్లాయి. 'రోలెక్స్' క్యారెక్టర్‌తో రెండు సినిమాలను ప్లాన్ చేస్తున్నారు లోకేశ్. ఈ సినిమాల్లోనే కాకుండా ఆయన.. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రంలోనూ గ్యాంగ్‌స్టర్‌గా మెరవనున్నారు. ఈ సినిమా వర్కింగ్ టైటిల్ 'సూర్య 44'. అలాగే, సుధా కొంగర దర్శకత్వంలో నటిస్తున్న చిత్రంలోనూ సూర్య గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారని టాక్.

పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామా



తమిళ నటుడు కార్తీ కూడా ఓ గ్యాంగ్‌స్టర్ చిత్రంలో నటిస్తున్నారు. 'కార్తీ 29' వర్కింగ్ టైటిల్‌గా తమిళ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో ఆయన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. కార్తీ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామా వచ్చే ఏడాది ప్రేక్షకులను పలకరించనుంది.

గుంటూరు ఛానల్‌ను పరిశీలించిన ప్రత్యేకాధికారి

● ఆధునికీకరణ, విస్తరణ పనులకు క్రేంద్ర మంత్రి పెమ్మసాని చొరవ


బుడంపాడు వద్ద గుంటూరు ఛానల్ మ్యాప్ పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి కృష్ణమ నాయుడు

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 17 : గుంటూరు ఛానల్ పరిధిలో ముంపునకు గురైన పంట పొలాలను ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక అధికారి కృష్ణమనాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. వరదల కారణంగా ఓవర్ ఫ్లో ద్వారా డ్రెయిన్లు గుంటూరు ఛానల్లో కలిశాయని అధికారులు ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. అలాగే అనంతవరప్పాడు, గారపాడు, బుడంపాడు తదితర ప్రాంతాల్లో పర్యటించిన క్రమంలో నష్టపోయిన రైతులతో ఆయన మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కెనాల్స్‌కు గండ్లు, డ్రెయిన్లకు గండి పడి వరద నీరు పంట పొలాల్లో చేరాయని, తద్వారా పంట నాశనం అవడమేగాక తాము పూర్తిగా నష్టపోయామని రైతులు ఈ సందర్భంగా ఆయనకు తెలియజేశారు.

ఆధునికీకరణతో ముంపు ప్రమాదం నివారణ

గుంటూరు ఛానల్‌ను ఆధునికీకరణలో భాగంగా విస్తరణ చేపడితే మరోసారి ఈ స్థాయి వరదలు వచ్చినా వరద ముంపు ప్రమాదం జరక్కుండా చేయాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, విస్తరణ పనులను ఎక్కడ నుంచి ఎక్కడ వరకు, ఏయే ప్రాంతాల్లో ఎలా ప్రారంభించాలి అన్న అంశాలపై అధికారులతో మాట్లాడారు. సాధ్యాసాధ్యాలను తెలుసుకున్నారు. అలాగే నల్లమడ డ్రైన్ ఆధునికీకరణ, విస్తరణ పనుల పైనా సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడటంతోపాటు ఆధునికీకరణలో భాగంగా భూసేకరణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరల్డ్ బ్యాంక్, నాబార్డ్ తదితర సంస్థల ద్వారా నిధుల సేకరణకు గల అవకాశ మార్గాలను అన్వేషించి త్వరలోనే గుంటూరు ఛానల్, నల్లమడ డ్రైన్, గుంటూరు నల్లా డ్రైన్ ఆధునికీకరణ, విస్తరణ పనులను చేపట్టే ప్రయత్నం చేస్తామని ఈ సందర్భంగా కృష్ణమ నాయుడు తెలియజేశారు.

పెమ్మసాని చొరవ

గుంటూరు జిల్లాలో వర్షాలకు, వరదలకు పొంగుతున్న డ్రెయిన్లు, ముంపునకు గురవుతున్న పంట పొలాల మీద కేంద్ర మంత్రి పెమ్మసాని దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని కాలువలు, డ్రెయిన్లు, వాగుల పరిస్థితి, వాటి అభివృద్ధి అధ్యయనానికి ప్రత్యేక అధికారి కృష్ణమ నాయుడును పంపారు. ఆయన నివేదిక ఆధారంగా వీటి అభివృద్ధిపై ముందుకు సాగనున్నారు.

వరదల్లో సర్వం కోల్పోయాం ఆదుకోండి

● అక్రమ కేసులతో వైసీపీ నేతలు వేధిస్తున్నారు

● 31వ రోజు ప్రజాదర్బార్‌లో లోకేశ్‌కు విన్నపాల వెల్లువ


వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, సెప్టెంబరు 17: గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు అటు రాష్ట్ర వ్యాప్తంగా ఇటు స్థానికంగా భారీగా ప్రజలు వచ్చి వినతిపత్రాలు అందజేసి తమ బాధలను అర్జీల రూపంలో అందజేస్తున్నారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన లోకేశ్ వారి నుంచి విజ్ఞప్తులు స్వీకరించి సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

నియోజకవర్గ సమస్యలివే..

మంగళగిరి నియోజకవర్గం నుంచి పలు సమస్యలు ప్రజలు మంగళవారం విన్నవించారు. ఇటీవల సంభవించిన వరదలకు తమ ఇళ్లు పూర్తిగా నీట మునిగాయని, ఇంటిలోని వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు ధ్వంసమయ్యాయని ఉండవల్లికి చెందిన సీహెచ్ శ్రీనివాస్, ఏ.సుబ్రహ్మణ్యం, ఎస్.వెంకటరావు, సైదులు, లోకేశ్‌ను కలిసి విన్నవించారు. నష్టపరిహారం అందించడంతోపాటు ఎలక్ట్రానిక్ వస్తువుల మరమ్మతుల కోసం విజయవాడలో మాదిరిగా గుంటూరు జిల్లాలలోనూ ఉచిత సర్వీసు సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆభరణాల తయారీ కోసం తామిచ్చిన 630 గ్రాముల బంగారాన్ని మంగళగిరిలో పని చేసే పశ్చిమ బెంగాల్ కు చెందిన గోబెడ్ అనే వ్యక్తి అపహరించాడని, బంగారంతో బెంగాల్ పారిపోయిన అతన్ని అరెస్టు చేయించి తమ బంగారం ఇప్పించాలని మంగళగిరికి చెందిన బి.రవికుమార్, పి.కిరణ్, నాగసాయి, తదితరులు విన్నవించారు. దివ్యాంగురాలైన తాను అనారోగ్యంతో బాధ పడుతున్నానని, ఓపెన్ హార్ట్ సర్జరీ కోసం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని తాడేపల్లికి చెందిన వనమా అమ్ములు లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. తమ వద్ద అప్పుగా తీసుకున్న రూ.17లక్షలు చెల్లించకుండా వైసీపీ నేత దేవినేని అవినాష్ అండతో బెదిరిస్తున్నారని ఉండవల్లికి చెందిన కె.రమేష్ ఫిర్యాదు చేశారు. విజయవాడకు చెందిన సుబ్బారెడ్డి తన వద్ద రూ.17లక్షలు అప్పుగా


దివ్యాంగురాలి సమస్యను ఆలకిస్తున్న మంత్రి నారా లోకేశ్

తీసుకున్నారని అవినాష్ అనుచరులు తమ వద్ద ఉన్న ప్రామిసరీ నోట్లను, చెక్కులను బలవంతంగా లాక్కున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

రాష్ట్రస్థాయి విజ్ఞప్తులివే..

డిగ్రీ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం దేచర్లకు చెందిన వెలగాల వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పని చేస్తున్నవారిని రెగ్యులరైజ్ చేయడంతోపాటు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాలుగేళ్లుగా వైకాపా నాయకులు, పలువురు కౌన్సిలర్లు అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాపట్ల జిల్లా చీరాలకు చెందిన వల్లెపు బాల అంకమ్మరావు లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. తనపై హత్యాయత్నం కూడా జరిగిందని ఇంటిలో చోరీ జరిగిందని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, న్యాయం చేయాలని కోరారు. విజయవాడలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తమ ఇల్లు నీట మునిగిందని, ఇంటిలోని సామగ్రి మొత్తం వరదల్లో కొట్టుకు పోయాయని, తగిన పరిహారం అందించి ఆదుకోవాలని కన్నీటి పర్యంతమయ్యారు. పరిశీలించి తగిన పరిహారం అందిస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. నెల్లూరు జిల్లా రామాపురంకు చెందిన రాయవరపు మాలకొండయ్య ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తాను అప్పు చేసి బైపాస్ సర్జరీ చేయించుకున్నానని, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడూ కొనసాగనున్న ప్రజాదర్బార్

ఉండవల్లిలో జరుగుతున్న ప్రజాదర్బార్ బుధవారం కూడా కొనసాగుతుందని నారా లోకేశ్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు చెప్పారు.

సీఎం సహాయ నిధికి విరాళాలు


చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న సంగం చైర్మన్ నరేంద్ర కుమార్

సంగం ఆధ్వర్యంలో రూ.50 లక్షలు

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), సెప్టెంబరు17: వరద బాధితుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షల విరాళం అందజేసినట్లు సంగం డెయిరీ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబుకు ఈ చెక్కును సంగం చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, పాలకవర్గ సభ్యులు అందజేశారు. కరోనా సమయంలోనూ రాష్ట్ర ప్రజలను ఆదుకునేందుకు రూ. 50 లక్షలు సంగం డెయిరీ విరాళంగా అందజేసింది. అలాగే చెన్నైలో వరదలు వచ్చిన సమయంలో సంగం డెయిరీ పాలు, పెరుగు వంటి నిత్యవసర వస్తువులను ప్రజలకు ఉచితంగా సరఫరా చేశారు. వరదల నేపథ్యంలో 70 టన్నుల పశుదాణాను పాడి రైతులకు జిల్లాలో ఉచితంగా పంపిణీ చేశారు.

వావిలాల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో..

సత్తెనపల్లి, సెప్టెంబరు 17: వావిలాల కుటుంబ సభ్యులు మంగళవారం మంగళగిరిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలసి వరద బాధితుల సహాయార్థం లక్ష రూపాయల విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు వావిలాల సంస్థకు అండగా ఉంటామని, వావిలాల ఆశయ సాధన కోసం కృషి చేయాలని సూచించినట్టు వావిలాల వారసుడు మన్నవ చోడేకర్ తెలిపారు. వరద బాధితులు ఐదు వందల మందికి దుస్తులు కూడా అందించామన్నారు. వావిలాల జయంతి సందర్భంగా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారని ఆయన చెప్పారు. రూరల్ డెవలప్‌మెంట్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో వావిలాల సంస్థను భాగస్వామ్యం చేస్తామని చంద్రబాబు నాయుడు చెప్పారన్నారు. చంద్రబాబు నాయుడును కలసిన వారిలో వావిలాల సంస్థ చైర్మన్ వావిలాల లీలా మహేశ్వరి, సంస్థ అధ్యక్షుడు వావిలాల సత్యం, కార్యదర్శి వావిలాల రమాదేవి ఉన్నారు.


సీఎం చంద్రబాబుకు చెక్కును అందిస్తున్న వావిలాల కుటుంబ సభ్యులు

వెంకయ్య స్ఫూర్తిని కొనసాగించాలి


నూతన అదనపు లైబ్రరీని ప్రారంభిస్తున్న రచయిత, సామాజిక కార్యకర్త, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ చైర్మన్ గీతారామస్వామి

పెదనందిపాడు, సెప్టెంబరు 17: కమ్యూనిస్టు యోధుడు కొల్లా వెంకయ్య స్ఫూర్తిని, ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రచయిత, సామాజిక కార్యకర్త, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ చైర్మన్ గీతారామస్వామి అన్నారు. కొల్లా వెంకయ్య 26వ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక కొల్లా వెంకయ్య గ్రంథాలయం వద్ద నూతన అదనపు లైబ్రరీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మట్లాడుతూ వెంకయ్య జీవిత విషయాలను బయోపిక్ తీసి ప్రజలకు, నేటి యువతకు వివరించాలన్నారు. యువకులు పోరాటాలకు వెనుకడుగు వేస్తున్నారని, వెంకయ్య ఆనాడు అతి పిన్న వయస్సులోనే ప్రజా సమస్యలపై ఉద్యమాలకు ఆకర్షితుడై పోరాటాల్లో పాల్గొన్నారని, యువత ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య మాట్లాడుతూ అందరికీ సమాన అవకాశాలు కల్పించడమే కమ్యూనిజమని, ఆ సిద్ధాంతం కోసం వెంకయ్య తుదిశ్వాస వరకు పోరాడారన్నారు. ఉద్యమాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కరించారన్నారు. ఈ ప్రాంతం ఎక్కువ శాతం నాయకత్వ లక్షణాలు కలిగిన వారు ఎంతోమంది పర్వతనేని వీరయ్యచౌదరి, కొల్లా వెంకయ్య లాంటి మహానుభావులు ఉండడం శుభపరిణామం అన్నారు. తొలుత పాతబస్టాండ్ సెంటర్లో సీపీఎం జెండాను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొల్లిపర వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. కొల్లా వెంకయ్య విగ్రహానికి పూలమాలలు వేసి, జోహార్లు అర్పించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, విశ్రాంత ఏఎస్పీ కాళహస్తి సత్యనారాయణ, నిర్వాహకులు కొల్లా రాహుల్ సాంకృత్యాయన్, డాక్టర్ కొల్లా రాజమోహనరావు, డాక్టర్ అమర్, హైమావతి, అనిత, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, ముద్దన నగరాజకుమారి, మానం విజేత, పలు సంఘాల నాయకులు రావి శివరామకృష్ణయ్య, కుర్రా హరిబాబు, యార్లగడ్డ అంకమ్మచౌదరి, లావు అంకమ్మచౌదరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసుల్లో పారదర్శకంగా విచారణ

● టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఇప్పటి వరకు 29 మంది అరెస్టు

● చంద్రబాబు నివాసంపై దాడి కేసులో 9 మంది..

● గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడి

గుంటూరు, సెప్టెంబరు 17: మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసుతోపాటు సీఎం చంద్రబాబు నివాసంపై జరిగిన దాడి కేసులోనూ పారదర్శకంగా విచారణ జరుగుతున్నట్లు గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసుకు సంబంధించిన విచారణ నివేదికలను ఎప్పటికప్పుడు హైకోర్టుకు నివేదిస్తున్నట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ఇప్పటి వరకు 110 మందిని నిందితులుగా గుర్తించామన్నారు. అందులో 68 మంది జిల్లా కోర్టును ఆశ్రయించారని, నలుగురు హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. ఆ కేసులో ఇప్పటి వరకు 29 మందిని అరెస్ట్ చేశామన్నారు. హైకోర్టు, జిల్లా కోర్టులో ఆయా అరెస్టులకు సంబంధించి నిందితులు దాఖలు చేసుకున్న పిటిషన్‌లపై విచారణ జరుగుతుందని తెలిపారు. గుంటూరు కోర్టులో 64 మందికి అరెస్టు చేయవద్దని, ఈనెల 26వ తేదీ వరకు కోర్టు ఆదేశాలున్నాయన్నారు. 26వ తేదీ తరువాత కోర్టు ఆదేశాలను బట్టి నడుచుకుంటామన్నారు. కోర్టు నుంచి ప్రొటెక్షన్ తెచ్చుకున్న నలుగురిని మళ్లీ విచారణ కోసం పిలుస్తామన్నారు. అయితే నిందితుల్లో 9 మందిని అరెస్టు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా తాడేపల్లి పరిధిలోని సీఎం చంద్రబాబు నివాసంపై జరిగిన దాడి కేసులో ఇప్పటివరకు 9 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. 13 మందిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో న్యాయ సలహా ప్రకారమే అదనంగా సెక్షన్లు చేర్చినట్లు తెలిపారు. ప్రధానంగా జిల్లాలో తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం, చంద్రబాబు నివాసంతో పాటు ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు కేసుల్లో విచారణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

రఘురాం రాజు కేసులో..

రఘురాం రాజు కేసులో అప్పటి సీఐడీ అదనపు ఎస్పీ కె.విజయపాల్ ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారన్నారు. దానికి తాము కోర్టులో కౌంటర్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఈ మూడు కేసుల్లో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విచారణ జరుగుతున్నట్లు తెలిపారు. ఎటువంటి అపోహలకు తావు లేకుండా పక్కా ఆధారాలు సేకరించి ఆ ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ పోలీస్ కస్టడీ ముగిసిందని తెలిపారు. అయితే ఆ కేసు కోర్టు విచారణలో ఉన్నందున పోలీసుల విచారణలో నిందితుడు సురేష్ ఏం చెప్పాడు అనేది బయటకు చెప్పలేమన్నారు. అయితే ఆయన చెప్పిన ప్రతి విషయాన్ని రాతపూర్వకంగా కోర్టుకు సమర్పించనున్నట్లు తెలిపారు.

భారీగా గోవా మద్యం పట్టివేత

● 1236 ఫుల్ బాటిళ్లు, 72 కేసుల బీర్లు స్వాధీనం


సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ నఫీజ్‌బాషా

మాచర్ల రూరల్, సెప్టెంబరు 17: గోవా నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యంను విజయపురిసౌత్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మండలంలోని విజయపురిసౌత్ పోలీస్‌స్టేషన్లో మంగళవారం మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. నాగార్జున సాగర్ అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో పోలీసు సిబ్బంది సాధారణ తనిఖీల్లో భాగంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న దోస్త్ వాహనాన్ని నిలిపి తనిఖీ చేశారు. వాహనంలో గోవా రాష్ట్రానికి చెందిన 1236 ఫుల్ బాటిళ్లు, 72 బీరు కేసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. వాహన డ్రైవర్‌తోపాటు వాహనంలో ఉన్న మరో వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా మద్యంను గోవా రాష్ట్రం నుంచి గుంటూరుకు తరలిస్తున్నట్లు తెలిసిందని సీఐ నఫీజ్‌బాషా తెలిపారు. ఎవరైనా బియ్యం, లిక్కర్, మైనింగ్‌కు సంబంధించి అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విజయపురి సౌత్ ఎస్ఐ మహ్మద్ షఫి, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థిని బలవన్మరణం

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 17: పట్టణంలోని ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రొంపిచర్ల మండలం వడ్లమూడివారిపాలెం గ్రామానికి చెందిన 14 ఏళ్ల జయలక్ష్మి అనే విద్యార్థిని మంగళవారం మధ్యాహ్నం పాఠశాల వసతి గృహంలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలు మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లిందనీ, మధ్యాహ్నం 12 గంటల సమయంలో భోజనానికి అని హాస్టల్‌కు వచ్చిందని ఆమె మిత్రులు తెలిపారు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో జయలక్ష్మి ఫ్యాన్‌కు చున్నీతో వేలాడటాన్ని ఆమె మిత్రురాలు రమ్య గమనించి హాస్టల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు పోలీసులకు సమాచారం అందజేశారు. రెండో పట్టణ సీఐ హైమారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలు తండ్రి యలమందయ్య మాట్లాడుతూ తన కూతురు మూడు రోజులు సెలవులకు ఇంటికి వచ్చిందనీ, 16వ తేదీ సాయంత్రం పాఠశాలలో వదిలి పెట్టానన్నారు. ఆ సమయంలో కూడా తన కుమార్తె ఎటువంటి బాధ ఉన్నట్టు తన దృష్టికి తేలేదు అన్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో తనకు తన కూతురు బాధ పడుతుతున్నట్లు పాఠశాల నుంచి సమాచారం వచ్చిం దన్నారు. రెండు గంటల పాటు తనను కూతుర్ని చూడనివ్వలేదని ఆరోపించారు. తన కూతురి మరణంపై తనకు అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ విషయమై రెండో పట్టణ సీఐ హైమారావు వివరణ అడుగగా మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానం


కుమారినందను అభినందిస్తున్న ఇన్చార్జి వీసీ ఆచార్య కె.గంగాధర్‌రావు

పెదకాకాని, సెప్టెంబరు 17: ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో అమలాపురంలో జరిగిన 11వ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న పరుచూరు కుమారి నందకు మహిళల సీనియర్ కేటగిరిలోని 76 కేజీల విభాగంలో మొదటి బహుమతి, అలాగే బెంచ్ ప్రెస్ ఛాంపియన్షిప్ లో మొదటి బహుమతిని సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు ఆమెకు అభినందనలు తెలియజేశారు. గంగాధర్‌రావు మాట్లాడుతూ కుమారి నంద భవిష్యత్తులో జరగబోయే నేషనల్ ఈవెంట్‌లో కూడా ఇలాగే రాణించి మరిన్ని పతకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేస్తూ ఆమెకి శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ పి.వెంకటరమణ, డాక్టర్ సురేష్ చెన్నం, డాక్టర్ పి .శివరాం, డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ ఎన్.రాధిక, ఎస్ చంద్రశేఖర్, చెన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏ హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ క్యాంపస్ డ్రైవ్

పెదకాకాని, సెప్టెంబరు 17: వర్సిటీలోని ఎంబీఏ హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు జరిగాయి. హైదరాబాద్ లోని ఏఐజీ (ఆసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ)లో అవుట్ పేషెంట్ కోఆర్డినేటర్, ఇన్ పేషెంట్ కోఆర్డినేటర్ పోస్టులకు నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 90 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 14మందికి ఆఫర్ లెటర్‌ను ఇచ్చారు. మరి కొంతమంది అభ్యర్థులకు హైదరాబాద్‌లో జరిగే ఇంటర్వ్యూలకు రావాలని సూచించారు. ఈ ఇంటర్వ్యూలకు ఏఐజీ హెచ్‌ఆర్ ప్రతినిధులు అనిల్, దివ్య పాల్గొన్నారు. విభాగాధిపతి డాక్టర్ బట్టు నాగరాజు అధ్యాపకులు డాక్టర్ పి.శ్రీనివాస్, డాక్టర్ సాధిక్, డేవిడ్ రాజు, సీహెచ్. ప్రసాద్ ఇంటర్వ్యూలను పర్యవేక్షించారు.

2 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, సెప్టెంబరు 17: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ 2 క్రస్ట్‌గేట్ల ద్వారా మంగళవారం అధికారులు నీటిని విడుదల చేశారు. 2 గేట్లను 8 అడుగుల మేర ఎత్తి 24,884 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం 589.90 అడుగులు ఉంది. ఇది 311.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4613 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,420 క్యూసెక్కులు, 2 క్రస్ట్‌గేట్ల ద్వారా 24,884 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 70,437 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 70,437 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

1.0208 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, సెప్టెంబరు 17: నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ ప్రాజెక్టులో సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 52,549 ఎంయూల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు ఎస్ఈ కె.వెంకట రమణ చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన 2 గేట్లను 3 మీటర్లు, 1 రేడియల్ క్రస్ట్ గేట్‌ను 2.5 మీటర్ల మేర ఎత్తి 44,180 క్యూసెక్కులు, టేల్ రేస్ ఛానల్ ద్వారా 8,369 మొత్తంగా 52,549 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.50 మీటర్లమేర నీరుండగా ఈ నీరు 7.0810 టీఎంసీలకు సమానమన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 17: ప్రాజెక్టులో మంగళవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 51,019 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 51,019 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుందని, దీనిలో 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువకు విడుదల అవుతున్నట్టు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121.129.140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

43,418 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 47,720 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 43,418 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 20,492 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17000	334	9000	15500
నెంబరు. 5	11000	15000	నెంబరు. 5	10500	15000
273	10000	14200	273	--	--
341	8700	16000	341	10000	17000
4884	14000	16000	4884	10000	17000
సూపర్ 10	14000	16000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18600	తేజ	8000	18500
బ్యాడిగి	8000	15000	బ్యాడిగి	10000	14200
దేవనూరు డీలక్స్	9500	15200	దేవనూరు డీలక్స్	15500	15500
తెల్లకాయలు	5000	11000	తెల్లకాయలు	6000	10500

కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలుస్తాం

● ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, సెప్టెంబరు 17 : కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలుస్తామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. టీడీపీ కార్యాలయంలో మంగళవారం నాయకులు, అధికారులతో కలిసి ప్రజాదర్బార్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఐదేళ్లుగా ఎలాంటి భరోసాలేక ఇబ్బందులు పడుతున్న వారికి అండగా ఉండి వారి కష్టాలు తీరుస్తామన్నారు. పెన్షన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, ఉద్యోగాల కోసం యువత, విద్య, వైద్యం కోసం సామాన్య ప్రజలు సమస్యల పరిష్కారం కోసం బాధితులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆయా శాఖల అధికారులకు ప్రజల సమస్యలను తెలియజేసి పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, తహసీల్దార్ శ్రీదేవి, విద్యుత్ ఏఈ పి.శ్రీనివాసరావు, టీడీపీ నేత జి.శ్రీనివాసరావు తదితరులున్నారు.

కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతి వేడుకలు



విశ్వకర్మ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జేసీ ప్రఖర్‌జైన్, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

బాపట్ల,సెప్టెంబరు 17 : కలెక్టరేట్‌లో మంగళవారం విశ్వకర్మజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులతో కలిసి ఆయన పటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు కడలి జగదీష్ కుమార్, జిల్లా కోశాధికారి ఎం.సుధాకర్, జిల్లా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెం, సెప్టెంబరు 17 : కర్లపాలెం శ్రీపెద్దింటమ్మతల్లి గుడిలో భగవాన్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాలు ఘనంగా మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని విశ్వబ్రాహ్మణ కుటుంబసభ్యులు పాల్గొని పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

హత్యకేసులో అనుచరుడిపైనే అనుమానం..?

● అనుమానితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు

బాపట్ల, సెప్టెంబరు 17: బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో ఫైనాన్స్ వ్యాపారి ఏసుబాబును పీక కోసి దారుణంగా హత్య చేసిన కేసులో అనుచరుడిపైనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏసుబాబు గుమస్తాగా పనిచేస్తున్న చంద్రశేఖర్ అలియాస్ చిన్ను కొంతమందికి ఫైనాన్స్ డబ్బులు ఇప్పించాడని ఆ డబ్బులు తిరిగి వసూళ్ళు చేసే విషయంలో ఏర్పడిన మనస్పర్ధలతో నమ్మకంగా ఉంటూ వెన్నుపోటు పొడిచాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కత్తిపోట్ల అనంతరం సూర్యలంక వచ్చి పడిపోయిన ఏసుబాబు పదేపదే గుమస్తా పేరును చెప్పటం కూడా అనుమానంగా భావించవచ్చు. పోలీసులు ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకొని అనుమానితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

స్టువర్టుపురంలో కెనాల్ లైన్ ప్లాంటేషన్

బాపట్ల, సెప్టెంబరు 17 : మండలంలోని స్టువర్టుపురం గ్రామంలో మంగళవారం కెనాల్ లైన్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్వామా ఇన్‌చార్జి పీడీ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్టువర్టుపురం నుంచి బేతపూడి వెళ్ళే కాల్వకట్టపై మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వై పిచ్చిరెడ్డి, డ్వామా ఏపీడీ సువార్త, ఏపీవో లక్ష్మీనారాయణ, ఎంపీడీవో పులి శరత్‌బాబు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథకం కూలీలు పాల్గొన్నారు.

జిల్లా పశుసంవర్ధక శాఖాధికారిగా డాక్టర్ వేణుగోపాల్

బాపట్ల,సెప్టెంబరు 17 : జిల్లా పశుసంవర్ధకశాఖాధికారిగా డాక్టర్ వేణుగోపాల్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ హనుమంతరావు ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ కావటంతో ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా మార్కాపురం సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న డాక్టర్ వేణుగోపాల్‌ను ఉద్యోగోన్నతిపై ఇక్కడ నియమించారు. బాధ్యతలు చేపట్టిన ఆయన కలెక్టర్ జె.వెంకట మురళిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల్‌కు పలువురు అభినందనలు తెలియజేశారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

చెరుకుపల్లి, సెప్టెంబరు 17: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది నిత్యం ఉదయం నుంచి సాయంత్రం వరకు సచివాలయాల్లో ఉండి ప్రజలు అందించే అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయన చెప్పారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపకపోతే తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పీడీ-పీఈటీలకు శిక్షణా కార్యక్రమం

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 17: పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు మంగళవారం నియోజకవర్గ స్కూల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కార్యక్రమాన్ని కోఆర్డినేటర్ కత్తి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విధివిధానాలు విద్యార్థులకు పూర్తి స్థాయిలో శిక్షణనిచ్చే పీడీ-పీఈటీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంఈవో-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● 19 నుంచి ఎస్‌జీఎఫ్ మండలస్థాయి సెలక్షన్స్ కార్యక్రమాన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు నిర్వహిస్తున్నట్లు మండల కోఆర్డినేటర్ ఎం ప్రశాంత్‌బాబు తెలిపారు. వివరాలకు 8985995544ను సంప్రదించాలని తెలిపారు.

అనుమతి లేని భవన నిర్మాణానికి నోటీసులు

వేమూరు, సెప్టెంబరు 17: మండలంలోని చావలి గ్రామంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తన సొంత స్థలంలోని భవన నిర్మాణం చేపడుతున్న వ్యక్తికి పంచాయతీ కార్యదర్శి మంగళవారం నోటీసు జారీ చేశారు. గ్రామానికి చెందిన వెలివెల సుబ్బయ్య తన స్థలంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా భవన నిర్మాణం చేపట్టాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థుడు వెలివెల నాగేశ్వరరావు ఎంపీడీవోకి ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారి దీనిపై పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని కార్యదర్శి గాజుల శ్రీనివాసరావును ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు కార్యదర్శి నిర్మాణ స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవని గ్రహించి వెంటనే నిర్మాణం పనులను ఆపుదల చేయాలని ఆదేశిస్తూ సుబ్బయ్యకు నోటీసును జారీ చేశారు.

దళితులపై వైసీపీ సానుభూతిపరుల దాడి

బాపట్లరూరల్, సెప్టెంబరు 17: దళితులపై వైసీపీ సానుభూతిపరులు దాడికి పాల్పడిన ఘటన మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే బాపట్ల మండలం మర్రిపూడి గ్రామంలో ఎస్టీ మహిళపై అదే గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరులు అసభ్యకరంగా ప్రవర్తించారు. దీనిని ఖండించిన ఎస్టీ యువకులపై వారు దాడికి పాల్పడ్డారు. దళితుల ఇళ్ళపైకి వచ్చి కర్రలతో దాడికి పాల్పడుతూ ఊరిలోకి వస్తే చంపేస్తామని బెదిరించడంతో భయభ్రాంతులకు గురయ్యారు. అయితే ఈ ఘటన పోలీసుస్టేషన్‌కు వెళ్లినప్పటికి గ్రామంలోని రెండు వర్గాల పెద్దలు రాజీ గురించి చర్చలు జరుపుతున్నారు. ఈ ఘటనపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వకపోవటంతో పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయలేదు.

స్వచ్ఛత హీ సేవలో ప్రజలు భాగస్వాములు కావాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



మున్సిపల్ అధికారులతో కలిసి స్వచ్ఛత హీ సేవా ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, సెప్టెంబరు 17 : ప్రజలు బాగుండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కోరారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ అధ్య క్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకుండా చూడాలన్నారు. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు అందించిన సేవలు అభినందనీయమన్నారు. వారి సేవలకు గుర్తుగా త్వరలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మందపాటి ఆంధ్రేయ, ఇనగంటి గాంధీ మున్సిపల్ మేనేజర్ లక్ష్మణ్, టీడీపీ నాయకులు సరోజినీ, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం

బాపట్ల, సెప్టెంబరు 17 : బాపట్ల ఆర్టీసీ డిపోలో మంగళవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిపో మేనేజర్ టి.అజిత కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిబ్బంది, డిపో సూపర్‌వైజర్లు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలి : డీఎంహెచ్‌వో

బాపట్ల, సెప్టెంబరు 17: పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించి అక్కడ జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వారానికి రెండు గంటలు స్వచ్ఛందంగా పరిశుభ్రత కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్లపాలెం, సెప్టెంబరు 17: కర్లపాలెం మండలపరిషత్ కార్యాలయం ఆధ్వర్యం లో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్లపాలెం హైస్కూల్ నుంచి మండలపరిషత్ కార్యాలయం వరకు విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరత్నం, ఇన్‌చార్జి ఎంపీడీవో ఏలీషాబాబు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 17 : పిట్టలవానిపాలెం గ్రామపంచాయతీ నందు ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, ఎంపీడీవో భవనం మారుతిశేషమాంబల ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామసర్పంచ్ బొలగాని అరుణకుమారి, వివిధ శాఖల అధికారులు, గ్రామపంచాయతీ సభ్యులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు డ్వాక్రా మహిళల విరాళం రూ.9.12 లక్షలు

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు చెక్కు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.9లక్షల 12వేల విరాళాల మెగా చెక్కును ఎమ్మెల్యే నరేంద్రవర్మకు అందజేస్తున్న డ్వాక్రా మహిళలు

బాపట్ల, సెప్టెంబరు 17: వరద ప్రభావిత ప్రాంత ప్రజలకు సాయం అందించేందుకు డ్వాక్రా మహిళలు ముందుకొచ్చారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సేకరించిన రూ.9లక్షల12వేల మెగా చెక్కును మంగళవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు అందజేశారు. బాపట్ల మండల సమైక్య ఆధ్వర్యంలో 6లక్షల 20వేల రూపాయలు, పిట్టలవాని పాలెం మండలపరిధిలో రూ.2లక్షల92వేలు కలిపి మొత్తం రూ.9లక్షల 12వేలు సమీకరించి చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ ముంచెత్తిన వరదలతో సర్వస్వం కోల్పోయిన కుటుంబాల వారికి సాయం అందించేందుకు ముందుకు రావటం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వై పిచ్చిరెడ్డి, బాపట్ల ఏపీఎం డి.సురేష్, పిట్టలానిపాలెం ఏపీఎం కె.సంతోష్‌కుమార్, పట్టణ, మండల టీడీపీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, వెలుగు కమ్యూనిటి కోఆర్డినేటర్లు, మండల సమైక్య అధ్యక్షులు, రెండు మండలాల గ్రామసంఘం అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో పలువురు విరాళాల అందజేత

బాపట్ల,సెప్టెంబరు 17 : వరదబాధితులకు సాయం అందించేందుకు మేము సైతమంటూ పలువురు ముందుకొచ్చారు. టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నరేంద్రవర్మకు మువ్వా కన్‌స్ట్రక్షన్స్ అధినేత మువ్వా వెంకటేశ్వర్లు తన భార్య మువ్వా జ్యోతిర్మయి పేరుమీద రూ.50వేల చెక్కును అందజేశారు. జేమ్స్‌స్కూల్ అధినేత ఆదెళ్ళ విజయ్‌కుమార్ రూ.50వేల చెక్కును, పద్మావతి ఫర్టిలైజర్స్ నిర్వాహకులు పెద్దబ్బాయి పేరిట రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మందపాటి ఆంధ్రేయ, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, మాడా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

బాపట్ల, సెప్టెంబరు 17 : విద్యార్థులు తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎంఎం కొండయ్య కోరారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్‌విజయమ్మ ఆధ్వర్యంలో ఆల్బెండ్ జోల్ మాత్రలు వినియోగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు ముఖ్యఅతిథులుగా పాల్గొని విద్యార్థులకు మాత్రలు వేసి వాటి ఉపయోగం గురించి వివరించారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి డాక్టర్ సౌజన్య, డీపీఎంవో డాక్టర్ రోహిణి రత్నశ్రీ, వైద్యాధికారి డాక్టర్ మౌనిక, వైద్య సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేమూరు, సెప్టెంబరు 17: మండల గ్రామాల్లో మంగళవారం నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. మండల వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటసురేష్‌బాబు పర్యవేక్షణలో సిబ్బంది 1 నుంచి 19 సంవత్సరాల వయసు కలిగిన వారికి మందు లు పంపిణీ చేశారు. పాఠశాలలకు వెళ్లి మందులు పంపిణీ చేశారు. మండలంలో 4488 మందికి గాను 4310 మందికి పంపిణీ చేసినట్లు సూపర్‌వైజర్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటలక్ష్మి, పబ్లిక్ హెల్త్ నర్సు రత్నకుమారి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



వెదుళ్ళపల్లిలో ప్రధాని మోదీ జన్మదిన కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు జీవీఎల్ మోహన్‌గౌడ్, శ్యామ్‌సుందర్, అప్పిరెడ్డి తదితరులు

బాపట్ల, సెప్టెంబరు 17: మండలంలోని వెదుళ్ళపల్లిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు శ్యామ్‌సుందర్, అప్పిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా నాయకుడు జీవీఎల్ మోహన్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కె.మణియాదవ్, ఎస్ గణేష్, ఆర్‌జే శాస్త్రి, శ్రీనివాసరాజు, నటరాజన్ తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె, సెప్టెంబరు 17: దేశాభివృద్ధి ప్రధానిమంత్రి నరేంద్రమోదీతోనే సాధ్యమని బీజేపీ సీనియర్ నాయకుడు పిన్ని సాంబశివరావు అన్నారు. మంగళవారం నిజాంపట్నం కూచినపూడిలో మోదీ 74వ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వేమూరు, సెప్టెంబరు 17: వేమూరులో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందా జనార్ధన్ మోదీ జన్మదిన కేక్ చేశారు. అనంతరం వేమూరు ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తాడికొండ సాంబశివరావు, జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి యల్లమాటి దాసు, రాంబాబు, వైద్యులు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

బాపట్ల, సెప్టెంబరు 17: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డిడియు జికెవై, సీడప్ వారి సంయుక్త ఆధ్వర్యంలో బాపట్ల నైపుణ్య కళాశాలలో ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఈ తమ్మాజీరావు తెలిపారు. ఈ విషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆక్వాటిక్ యానిమల్ హెల్త్‌ల్యాబ్ సూపర్‌వైజర్, ఆక్వాకల్చర్ టెక్నికల్ సూపర్‌వైజర్ కోర్సులలో మూడునెలలు పాటు ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఇంటర్మీడియట్ సైన్స్‌గ్రూప్‌లు, డిగ్రీ, డిప్లమో, పీజీ నందు ఫిషరీస్ సబ్జెక్ట్ చదివిన 18 సంవత్సరాలు నుంచి 35 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులు అన్నారు. 60సీట్లు మాత్రమే పరిమితమన్నారు. మూడునెలలు పాటు ఉచిత శిక్షణ, వసతి, ఆహారం అందించబడుతుందన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్‌లు ఇవ్వటం, ఉద్యోగావకాశాలు కల్పించటం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు కోఆర్డినేటర్ ఎం.బుల్లియ్యను 93462 80289, 9988853335 నెంబర్లలో సంప్రదించాలన్నారు. లేదా బాపట్ల జీబీసీ రోడ్డులోని ధరివాద కొత్తపాలెం మున్సిపల్ యూపీ స్కూల్ ఎదురు నైపుణ్య కళాశాలలో సంప్రదించాలన్నారు.

గుర్రం జాషువా విగ్రహాన్ని పునర్నిర్మించాలి

● ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి

బాపట్ల, సెప్టెంబరు 17 : రోడ్డు విస్తరణలో భాగంగా జీబీసీ రోడ్డుపై ఉన్న మహాకవి గుర్రం జాషువా విగ్రహాన్ని తొలగించారని ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు పూర్తయినందున విగ్రహాన్ని పునర్నిర్మించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌ను వినతిపత్రం ద్వారా కోరారు. ఈ నెల 28వ తేదీన జాషువా జయంతి కార్యక్రమానికి విగ్రహాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య, దుడ్డు వందనం తదితరులున్నారు.



మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పేదలకు పక్కా గృహాన్ని అందించేందుకు కృషి

● మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్



లబ్ధిదారులకు తాళాలను అందిస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె, సెప్టెంబరు 17: పేద, మధ్యతరగతి కుటుంబాలకు పక్కా గృహాలను నిర్మించేందుకు ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి అనగాని సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మంగళవారం రేపల్లె మండలం పోటుమెరక గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకంలో భాగంగా నూతనంగా నిర్మించిన గృహాలను స్థానిక గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో గృహ ప్రవేశ మహోత్సవాలు నిర్వహించారు. లబ్ధిదారులకు ఇంటి తాళాలను అందించి గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆమోదంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో పేదలకు పక్కా గృహాలు నిర్మించే దిశగా ఎన్డీయే ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. త్వరలో గృహ నిర్మాణశాఖ ఆధ్వర్యంలో గృహాలను మంజూరు చేస్తారని వాటిని సద్వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ డీఈ సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు జానకిరామయ్య, సర్పంచ్ కాగితాల హనుమ పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల పెంపుదలకు కాంప్లెక్స్ సముదాయాల నిర్వహణ

బాపట్ల,సెప్టెంబరు 17 : నాణ్యమైన విద్యాప్రమాణాల పెంపుదలకు కాంప్లెక్స్ సముదాయాల నిర్వహణ ఎంతగానో దోహదపడుతుదని సమగ్రశిక్ష ఏఎంవో డాక్టర్ బిళ్ళా మోజెస్ అన్నారు. మండలంలోని అప్పికట్ల జిల్లాపరిషత్ హైస్కూల్‌లో మంగళవారం జరిగిన పాఠశాల సముదాయ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులంతా ఒకచోట సమావేశం కావటం వల్ల ఒకరికొకరు తెలిసిన విషయాలు చర్చించుకొని ముందుకు వెళ్ళటానికా ఆస్కారం ఏర్పడుతుందన్నారు. తద్వారా పిల్లల సామార్ధ్యాల పెంపుదలకు దోహదపడుతుందన్నారు. విద్యాంజలి 2.0లో వలంటీర్లను రిజిస్ట్రేషన్ చేయాలని సూచిం చారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ఛైర్‌పర్సన్ సుధారాణి, కార్యదర్శి మద్దాల సురేష్, టి.మాణిక్యారావు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

బాపట్లరూరల్, సెప్టెంబరు 17 : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని వెదుళ్ళపల్లి పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వెదుళ్ళపల్లి ఎస్ఐ పి.జనార్ధనరావు తెలిపిన వివరాలు ప్రకారం వెదుళ్ళపల్లి రైల్వే గేటు సమీపంలో గడ్డం గురవయ్య అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందటంతో అతడిని అదుపులోకి తీసుకొని 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి

కర్లపాలెం, సెప్టెంబరు 17: మండలంలోని ఎట్రావారిపాలెం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఎట్రా వీర్లంకమ్మ (103) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. వీర్లంకమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

పౌర్ణమి ధ్యానం

కర్లపాలెం, సెప్టెంబరు 17 : కర్లపాలెం శ్రీగురువాణి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో మంగళవారం పౌర్ణమి ధ్యానం నిర్వహించారు. కార్యక్ర మంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఆత్మజ్ఞానం గురించి వివరించారు. చంద్రశేఖరరావు, లీలాకుమారి దంపతులు పాల్గొన్నారు.

బాధితులకు చేయూతగా మంత్రికి రూ.లక్ష విరాళం



మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు రూ.లక్ష చెక్కును అందిస్తున్న ముమ్మలనేని గోపి

రేపల్లె, సెప్టెంబరు 17: వరద బాధితులకు తమ వంతు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు రేపల్లె పట్టణానికి చెందిన ముమ్మలనేని గోపి లక్ష రూపాయల చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గోపిని అభినందించారు. కార్యక్రమంలో డి.ధరణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, సెప్టెంబరు 17: మండలపరిధిలోని జువ్వలపాలెంలో వరద బాధితులకు దళిత బహుజన రీసోర్స్ సెంటర్ సభ్యులు అల్లాడి దేవకుమార్, అందించిన నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ ఇటీవల వచ్చిన భారీ వరదలకు కొల్లూరు, భట్టిప్రోలు మండలాలు పూర్తిగా నీట మునిగి తీరని నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం ముందుగా హెచ్చరికలు జారీ చేయడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని చెప్పారు. ఈ పరిస్థితులను చూసిన దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బాధితులకు సాయం చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, యార్లగడ్డ శ్రీనివాసరావు, వేములపల్లి రవికిరణ్, వేములపల్లి సత్యశ్రీనివాసరావు, గ్రామపెద్దలు, దళిత బహుజన రీసోర్స్ సెంటర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు మెడికల్ కళాశాల వైద్యుల బృందం సాయం



బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న గుంటూరు వైద్య కళాశాల వైద్యుల బృందం

భట్టిప్రోలు, కొల్లూరు, సెప్టెంబరు 17: వరద బాధితులకు గుంటూరు మెడికల్ కళాశాల వైద్యుల బృందం నిత్యావసరాలు పంపిణీ చేశారు. మంగళవారం భట్టిప్రోలు, కొల్లూరు మండలాల పరిధిలో ముంపునకు గురైన గ్రామాలైన పెదలంక మధ్య గూడెం, ఆందార్లలంక, జువ్వలపాలెం గ్రామాల్లో వైద్యుల బృందం సాయం అందించారు. చల్లపల్లి మండలం అందార్లలంక ఎంపీయూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, ఉపాధ్యాయుల చొరవతో ఎంపీపీ స్కూల్లో పంపిణీ చేశారు. జీఎంసీ 1990 బ్యాచ్‌కి చెందిన వైద్య మిత్ర బృందం దాదాపు రూ.10 లక్షల విలువ చేసే సరుకులు మూడు గ్రామాల బాధితులకు పంపిణీ చేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఫణిగోపాల్ మిత్రబృందం

కొల్లూరు, సెప్టెంబరు 17: ఇటీ వల వరదల కారణంగా విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని ఫణిగోపాల్ మిత్ర బృందం పుస్తకాలు పంపిణీ చేశారు. మంగళవారం కిష్కిందపాలెం, తోకలవానిపాలెం, గాజుల్లంక గ్రామాల్లో కిష్కిందపాలెం సచివాలయం, విద్య సహాయకులు ఫణిగోపాల్ బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కిష్కిందపాలెం టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు తదిత రులుపాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నిజాంపట్నంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

రేపల్లె, సెప్టెంబరు 17: గ్రామాల్లో అంటువ్యాధులు విజృంభించకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నిజాంపట్నం జడ్పీటీసీ నర్రాసుబ్బయ్య అన్నారు. మంగళవారం నిజాంపట్నంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ మండల ప్రజాపరిషత్ అధికారులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారని ఎప్పటికప్పుడు గ్రామాలు పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొమ్మిడి రామకృష్ణ, రెవెన్యూ మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి : అనగాని శివప్రసాద్

రేపల్లె, సెప్టెంబరు 17: పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు.మంగళవారం పట్టణంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా రహదారులను శుభ్రం చేసి డ్రెయిన్లలో మురుగును తొలగించారు. కార్యక్రమంలో కమిషనర్ సాంబశివరావు, టీడీపీ నేతలు డొక్కు బుజ్జి, ఐజమీర్, మున్సిపల్ ఆర్ఐ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యవంతమైన వాతావరణం

● టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు



వేమూరులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు

వేమూరు, సెప్టెంబరు 17 : పరిసరాలను శుభ్రతతోనే ఆరోగ్యవంతమైన వాతావరణం సాధ్యమని బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అన్నారు. వేమూరులో మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీవో అనూరాధ అధ్యక్షత న స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య మీటింగ్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశానికి విజయబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా నిలబడి స్వచ్ఛ భారత్ సాధన కోసం ప్రమాణం చేశారు.

ఏరియావైద్యశాలలో నరాల వైద్యశిబిరం

బాపట్ల, సెప్టెంబరు 17: అమెరికాలోని అలబామాకు చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ మూల్పూరు తేజానంద్ గౌతమ్ మంగళవారం బాపట్ల ఏరియా వైద్యశాలలో నరాల వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో నరాల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న 35 మందిని పరీక్షించి మందులు అందజేశారు.

ఘనంగా వినాయకుడికి వీడ్కోలు



జనసంద్రోహం నడుమ నిమజ్జనానికి తరలుతున్న విఘ్నేశ్వరుడు

పర్చూరు, సెప్టెంబరు 17: పర్చూరు మండలం దేవరపల్లి గ్రామంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహానికి మంగళవారం ఘనంగా వీడ్కోలు పలుకుతూ నిమజ్జనానికి తరలించారు. ముందుగా ప్రత్యేక పూజలు చేసిన ప్రత్యేక వాహనంలో స్వామివారిని ప్రత్యేక వాహనంలో ఏర్పాటుచేసి బాణసంచా కాలుస్తూ, డీజేలు, డప్పు వాయిద్యాల భారీ జనసంద్రోహం నడుమ ఊరేగింపు నిర్వహించారు. చీరాల వాడరేవు తరలించి నిమజ్జనం చేశారు. మార్టూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీఎల్ శ్రీనివాసరావు, ఎస్సై మాలియాద్రి నేతృత్వంలోని పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రూ.4లక్షలు పలికిన స్వామివారి లడ్డూ వేలం

దేవరపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం వద్ద భక్తులు స్వామివారికి సమర్పించిన లడ్డూకు వేలంపాట నిర్వహించగా గ్రామానికి చెందిన కొమ్మాలపాటి సురేష్ రూ.4లక్షలకు పాడుకొని ప్రసాద లడ్డూని పొందారు.

ప్రజలకు అందుబాటులో సబ్ రిజిస్ట్రార్ సీటు

మార్టూరు, సెప్టెంబరు 17 : ఎదురుగా టేబుల్ పైన కంప్యూటర్, సాధారణమైన కుర్చీలో సబ్ రిజిస్ట్రార్ సీహెచ్.రామకోటయ్య ఆసీనులైన దృశ్యం మంగళవారం మార్టూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కనిపించింది. రాష్ట్ర ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్ కూర్చునే సీటు వైఖరిని మార్చాలనే నిబంధన తెచ్చింది. వాటికి అనుగుణంగా మార్టూరు సబ్ రిజిస్ట్రార్ గతంలో ఉన్న వాటిని తొలగించి, కొత్తగా సాధారణ ఉద్యోగి లాగా తన సీటులో కూర్చున్నారు. ఈ నేపథ్యంలో వివిధ స్థలాలు, పొలాలు, తదితర రిజిస్ట్రేషన్లు నిమిత్తం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఈ మార్పుపై చర్చించుకుంటున్నారు.

వైసీపీ పాలనలో అక్రమ కేసులు

తెలుగు తమ్ముళ్లకు అండగా ఏలూరి

నియోజకవర్గ వ్యాప్తంగా 50మందిపై ఫిర్యాదులు

ఎమ్మెల్యే చొరవతో 25కు పైగా కొట్టివేత



హోంమంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు సెప్టెంబరు 17 : తెలుగు తమ్ముళ్లకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అండగా నిలుస్తున్నారు. వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారు. పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలే లక్ష్యంగా వందలాది కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో అక్రమ కేసులను కొట్టివేయించి తమ్ముళ్లకు అండగా నిలిచేందుకు ఏలూరి ప్రత్యేక దృష్టిసారించారు. ఇందుకోసం ఏలూరి క్యాంపు కార్యాలయంలో న్యాయ నిపుణులతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి కేసుల పరిష్కారానికి ఆయన దృష్టిసారించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి కేసుల పురోగతిపై సమీక్షిస్తున్నారు. అందులో భాగంగా రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత దృష్టికి తీసుకుపోయి అక్రమ కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే 25 అక్రమ కేసులను కొట్టివేశారని ఆయన తెలిపారు.

కేసుల పరిష్కారమే లక్ష్యంగా అడుగులు

జగన్‌రెడ్డి రాజకీయ కక్షలో భాగంగా అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడి ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయించింది. ఎలాంటి ఆధారాలు సాక్ష్యాలు లేని నమోదు చేసిన కేసులను అధికారుల ముందు ఉంచారు. సుమారు 50కిపైగా నియోజకవర్గంలో నాయకులు కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారు. వీటిలో 25 కేసులకు ఎలాంటి అధారాలు లేకపోవడంతో వాటిని కొట్టివేయించేలా ఎమ్మెల్యే చొవర చూపారు. మిగిలిన కేసులను కూడా కొట్టివేయిస్తామని ఏలూరి ధైర్యం చెప్పారు.

పాము కాటుతో రైతు మృతి

బల్లికురవ, సెప్టెంబరు 17 : మండలంలోని గుంటుపల్లికి చెందిన రైతు చల్లగుండ్ల నాగేశ్వరరావు (52) మంగళవారం పాము కాటుతో మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నాగేశ్వరరావు పొలం వద్ద పనులు చేస్తుండగా పాము కాటేసింది. నాగేశ్వరరావు ఇంటికి వచ్చి కాలికి ఏదో గాయమైందని సొంత వైద్యం చేసుకున్నారు. తర్వాత పశువుల వద్ద పనులు చేస్తుండగా కొద్దిసేపటికి నోటి నుంచి నురుగు రావడంతో భార్య గమనించింది. వెంటనే పీహెచ్‌సీలో చేర్పించారు. మెరుగైన చికిత్స నిమిత్తం చిలకలూరిపేట తరలించగా అప్పటికే నాగేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నాగేశ్వరరావుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఉన్నత విద్య కోసం అమెరికాలో ఉన్నాడు. వచ్చిన తరువాత అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతు మృతితో గుంటుపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి.

గవినివారిపాలెంలో పారిశుధ్యం అధ్వానం

కార్యదర్శి తీరుపై విమర్శలు

వృద్ధకార్మికుడి జీతం నిలిపివేత



అపరిశుభ్రంగా గ్రామంలో ప్రధాన జంక్షన్

చీరాలటౌన్, సెప్టెంబరు 17 : చీరాల మండల పరిధిలోని గవినివారి పాలెంలో గ్రామంలో పారిశుధ్య సమస్యలు తాండవిస్తున్నాయి. గత రెండేళ్లుగా పంచాయతీ నిధులు లేకపోవడంతో ఇంటిపన్ను వసూళ్ల ద్వారా శానిటేషన్, ఇతర మౌలిక వసతులను అందించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి. కానీ సెక్రటరీ నీలిమ కార్మికులు నెలలు తరబడి జీతాలు ఆపడంతో వారు విధులను బహిష్కరించారు. దీంతో గ్రామంలో వీధులు దారుణంగా మారాయి. చెత్తా చెదారంతో కంపుకొడుతున్నాయి. దీంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. బ్లీచింగ్ ఊసే లేదు. వీధి దీపాలు అసలే లేవు. గతంలో కూడా సెక్రటరీ ఇదే తరహాలో వ్యవహరించడంతో అప్పటి ఎంపీడీవో శోభారాణి మండల పరిధిలోని ప్రతి పంచాయతీ నుంచి ఇద్దరు కార్మికులను గవినివారిపాలెంకు పంపించి పారిశుధ్య పనులు చేయించారు. సెక్రటరీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా ఆమె అదే పద్ధతిని అనుసరించడంతో వీధులన్నీ అపరిశుభ్రంగా మారాయి. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. అయినా చీరాలకు రెగ్యులర్ ఈవోఆర్డీ లేపోవడం, డీఎల్‌పీవోగా అద్దంకి వారిని ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించిన పర్యవేక్షణ అసలు లేదు. ఈక్రమంలో ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఏడు నెలల జీతం సెక్రటరీ ఆపారు

- బుర్ల పోలయ్య, పాత పంచాయతీ కార్మికుడు

గ్రామంలోని ఆర్వోప్లాంట్ కార్మికుడిగా చాలా కాలంగా పని చేస్తున్నా. కార్యదర్శికి నాకు మధ్య వివాదం తలెత్తింది. ఏడు నెలలు జీతం ఆపారు. వృద్ధుడనని చూడకుండా పనిలోనుంచి తొలగించారు. జీతం విషయమై అడిగితే భయానికి గురి చేస్తున్నారు. అధికారులు న్యాయం చేయాలి.

అపార్ట్‌మెంట్ పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

కనిగిరి, సెప్టెంబరు 17 : నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ గోడలకు నీరు పడుతూ జారిపడి ఎర్రంరెడ్డి చెన్నారెడ్డి(62) మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వెన్నెల అపార్ట్‌మెంట్ వద్ద కొత్తగా మరో అపార్ట్‌మెంట్ నిర్మాణం జరుగుతోంది. మండల పరిధిలోని పునుగోడు గ్రామానికి చెందిన చెన్నారెడ్డి తన అల్లుడుకు చెందిన అపార్ట్‌మెంట్ నిర్మాణ నిర్వహణ బాధ్యతలు చూస్తున్నాడు. గోడలకు నీరు పెడుతూ ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. కింద పడిన సమయంలో తలకు ఫ్లోర్ బలంగా తగలటంతో రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు.

అంతా మామూళ్లే

విద్యుత్ శాఖ అవినీతిమయం

కొత్త కనెక్షన్ ఏర్పాటు అంటే పండగే

డబ్బులిస్తే ఇష్టారీతిన మార్పుచేర్పులు

కమర్షియల్ అయితే ఇష్టానుసారం

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.లక్ష డిమాండ్

మర్రిపూడిలో ఏఈ, లైన్‌మెన్‌పై సస్పెన్షన్ వేటు

ఇటీవల ఏసీబీ వలలో మరో లైన్‌మెన్

పంటలను కాపాడుకునేందుకు రైతుల అగచాట్లు

ఇదే అదనుగా దోచుకుంటున్న కరెంట్ సిబ్బంది

-రాచర్ల మండలం అనుమాలపాడులో గత నెలలో ఓ రైతు పొలంలో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, ఏర్పాటు కోసం వెళితే.. రూ.20 వేలు లంచం అడిగాడు లైన్‌మన్ రామలింగం. దీంతో ఆ రైతు విసిగిపోయి అతనిని ఏసీబీకి పట్టించాడు. లైన్‌మన్ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికాడని తెలిసి బాధిత రైతులంతా హర్షం వ్యక్తం చేసిన పరిస్థితి.

-మర్రిపూడి మండలంలో విజిలెన్స్ అధికారులు చేసిన విచారణలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. రైతుల నుంచి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం లక్ష నుంచి రెండు లక్షలు డిమాండ్ చేసినట్లు వెల్లడంచడం గమనార్హం. దీంతో ఏఈ, లైన్‌మన్‌ను అధికారులు సస్పెండ్ చేశారు.

- ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో విద్యుత్ శాఖ అధికారులు ఇష్టారాజ్యమైంది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలంటే రూ.50వేలు, పాతది మార్చాలంటే రూ.10వేలు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. స్తంభాలు, పరికరాలు అవసరం లేకపోయినా సరే మార్చినట్లు చూపి వాటిని రైతులకు అమ్ముకుంటున్నారు. ఇటీవల అమానిగుడిపాడు సబ్‌స్టేషన్‌లో 110 స్తంభాలను అమ్ముకోగా, అందులో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లను అధికారులు సస్పెండ్ చేశారు.

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 17 : విద్యుత్ శాఖ అవినీతిమయంగా మారింది. రైతులు పొలాలకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు విషయంలో లక్షలు డిమాండ్ చేసి జేబులు నింపుకొంటున్నారు. వేసిన పైర్లు ఎండిపోతున్నాయని విద్యుత్ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలాగా తిరిగినా లంచం ఇవ్వందే సిబ్బంది కదలని పరిస్థితి నెలకొంది. గత నెలలో రాచర్ల మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ విషయమై రైతును లంచం డిమాండ్ చేయడంతో అతను విసిగిపోయి లైన్‌మన్‌ను ఏసీబీకి పట్టించడమే ఇందుకు నిదర్శనం. అలాగే సామాన్యుడు చిన్న ఇల్లు నిర్మించుకున్నా అందుకు మీటరు ఏర్పాటు చేయాలంటే కనీసం రూ.5 వేలకు తగ్గకుండా వసూలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణను పూర్తిగా గాలికి వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో చేతివాటానికి అలవాటు పడిన సిబ్బంది అనేక విధాలుగా వినియోగదారులను ఇబ్బందులకు గురిచేసి వచ్చినకాడికి దండుకోవడం షరామామూలైంది. నగరంలో కమర్షియల్ కనెక్షన్ ఇవ్వాలంటే రూ.లక్ష డిమాండ్ చేయడం అందుకు ఉదాహరణ. మామూళ్లు ముట్టజెబితే ఎలాంటి అడ్డంకులు ఉండవు. లేకుంటే ఏదో ఒకస్థాయిలో దరఖాస్తులు వెనక్కి వస్తాయి. వినియోగదారులు నేరుగా కార్యాలయాలకు వెళితే ఎలాంటి పనులు కావు. అందుకు సంబంధించి కిందిస్థాయి ఉద్యోగులు లైన్‌మన్, ఏఈలను సంప్రదిస్తే వెంటనే పనులు చేయడం పరిపాటిగా మారింది. గత ఐదేళ్లుగా వేళ్లూనుకున్న అవినీతి ప్రభుత్వం మారినా అలాగే కొనసాగుతోంది. సిబ్బందిలో ఎలాంటి మార్పు రాలేదనే చెప్పవచ్చు.



ట్రాన్స్‌ఫార్మర్లు

-జిల్లాలోని విద్యుత్ శాఖలో ఇదీ పరిస్థితి. ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించుకొని వసూలు చేయడం పరిపాటిగా మారింది. కరెంట్ మీటర్లు ఇవ్వడం నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు వరకు లంచం ఇవ్వకపోతే అడుగు ముందుకు పడదు. కాదు కూడదంటే కనెక్షన్ కోసం నెలలు తరబడి తిరగాల్సిందే. లైన్‌మెన్ నుంచి ఉన్నతాధికార్ల వరకు అ మొత్తం వాటాలు పంచుకుతింటున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.లక్ష డిమాండ్

మర్రిపూడి మండలం గుళ్ళసముద్రంలో చంద్రమౌళి అనే రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం గత రెండేళ్లుగా తిరుగుతున్న ఉపయోగం లేదు. అందుకోసం విద్యుత్ అధికారులు రూ.లక్ష నుంచి రూ.1.5లక్షలు డిమాండ్ చేశారు. దీనిపై చంద్రమౌళి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ అధికారులను దర్యాప్తు చేయాలని సీఎండీ ఆదేశాలు ఇచ్చారు. దీంతో విచారణ చేపట్టిన అధికారులకు ఆశ్చర్యకరమైన విషయాలు తెలిశాయి. ఆయా ప్రాంతాల్లో రైతుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోసం రూ.లక్ష చొప్పున తీసుకున్నట్లు రైతులు తెలిపారు. ఈమేరకు విజిలెన్స్ అధికారులు నివేదిక ఇచ్చిన తర్వాత అక్కడ పనిచేస్తున్న ఏఈ రామకృష్ణారెడ్డి, లైన్‌మన్ బాలకృష్ణారెడ్డిలను సస్పెండ్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ కోసం కేవలం రూ.6,200లే కట్టాలి

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రైతులు ఒక్కొక్కరు కేవలం రూ.6,200 మాత్రమే చెల్లించాల్సి ఉంది. రూ.5వేలు డిపాజిట్, వెయ్యి రూపాయలు సెక్యూరిటీ డిపాజిట్, రూ.200 అప్లికేషన్ ఫీజు కట్టాలి. ఇలా ఐదుగురు రైతులు కలిసి రూ.31,000 చెల్లిస్తే 15 నుంచి 30 రోజులలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాలి. అసలు విద్యుత్ శాఖ కార్యాలయానికి రైతులు వెళ్లాల్సిన అవసరం కూడా లేదు. మీసేవ కేంద్రాలలో రూ.200 అప్లికేషన్ ఫీజుతో పాటు ఆ శాఖకు సంబంధించిన డిపాజిట్ రూ.6లు చెల్లిస్తే సరిపోతుంది. ఇలా అప్లికేషన్ పెట్టిన 30 రోజులలో ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలి. అయితే ఇలాంటి అప్లికేషన్లను పెండింగ్‌లో పెట్టి ఎవరు ఎక్కువ డబ్బులిస్తే వారికి ఏర్పాటు చేయడం ఎక్కువైంది.

అపార్ట్‌మెంట్‌కు కనెక్షన్ ఇస్తే రూ.లక్ష

అపార్ట్‌మెంట్‌లో వినియోగించుకునే మీటర్లకు విద్యుత్ శాఖకు డిపాజిట్ చెల్లించినా అదనంగా రూ.లక్ష ఇవ్వకుంటే ఆ దరఖాస్తులు వెనక్కి వస్తాయి. సామాన్యులు విద్యుత్ మీటరు ఏర్పాటుకు రూ.5వేలు వసూలు చేస్తున్నారు. మామూలుగా అయితే కిలోవాట్‌కు రూ.2వేలు చొప్పున చెల్లించి, సెక్యూరిటీ డిపాజిట్ రూ.800 చెల్లించడంతోపాటు మీసేవలో అప్లికేషన్ ఫీజు రూ.150 ఇవ్వాలి. అయితే లైన్‌మెన్లను సంప్రదిస్తే రూ.5 వేలు మీటరుకు వసూలు చేస్తున్నారు. ఇలా ప్రతి పనికి ఓ రేటు పెట్టి సామాన్యుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు.

వైపాలెం నియోజకవర్గంలో ఇష్టారాజ్యం

ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ పెంచాలంటే తప్పరిసరిగా దరఖాస్తు చేసుకోవాలి. అయితే వైపాలెం నియోజకవర్గంలో డబ్బులిస్తే చాలు ఎంత కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్ అయినా బిగిస్తున్నారు. ఈ విధంగా చేయడం వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లుతోంది. అయితే అధికారులు మాత్రం భారీగా లబ్ధిపొందుతున్నారు. వైపాలెం నియోజకవర్గంలో ఇప్పటికీ గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులే అన్ని వ్యవహారాలను చక్కబెట్టడం గమనార్హం. పుల్లలచెరువు మండలంలో హెచ్‌వీడీఎస్ జరగ్గా అందులో కొంత పాత సామానునే వాడారు. అయితే ఆ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినందుకు కూడా రైతుల వద్ద అదనంగా డబ్బులు వసూలు చేశారు. అలాగే మండలంలో ఒక అధికారి స్థానికంగా పాతుకుపోయారు. ఏ ప్రభుత్వం ఉన్నా అతనే చక్రంతిప్పుతున్న పరిస్థితి. అతని అర్హత లేకున్నా గతంలో మూడు మండలాలకు అధికారిగా కొనసాగారు. వైపాలెం మండలంలోని పిల్లికుంట నుంచి పుల్లలచెరువు మండలం మురికిమళ్ల వరకు 40ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన లైన్ నిరుపయోగంగా ఉంది. అయితే ఆ లైన్‌కు వాడిన ఇనుప స్తంభాలు, వైర్లను ఇటీవల తొలగించి గుట్టుచప్పుడు కాకుండా మాయం చేశారు. వాటి విలువ సుమారు రూ.15లక్షల వరకు ఉంటుందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు

- కెవిజి.సత్యనారాయణ, ఎస్ఈ

విద్యుత్ శాఖలో అవినీతికి పాల్పడితే ఎంతటి వారైన చర్యలు తప్పవు. మర్రిపూడి మండలంలో విజిలెన్స్ నివేదిక అధారంగా అక్కడ పనిచేస్తున్న ఏఈ, లైన్‌మన్‌ను సస్పెండ్ చేసాము. అదేవిధంగా ఏసీబీకి దొరికిన లైన్‌మన్‌పై కూడా చర్యలు తీసుకున్నాము. శాఖలో ఏ స్థాయి వారు అవినీతికి పాల్పడినా సహించేది లేదు. వినియోగదారులు నేరుగా తమ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు.

అరెస్టు భయంతో వైసీపీ ధర్నా ఎత్తుగడ

ప్రతిస్పందించిన టీడీపీ నేతలు

పకడ్బందీగా వ్యవహరించిన పోలీసులు

ఇరుపార్టీల నాయకులకు ముందస్తు నోటీసులు

దర్శిలో 144 సెక్షన్ విధింపు

అదనపు బలగాలతో కవాతు



ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డికి, పాపారావుకు నోటీసులు ఇస్తున్న పోలీసులు

దర్శి, సెప్టెంబరు 17 : దాడుల కేసులలో అరెస్టు చేస్తారనే భయంతో వైసీపీ నాయకులు వేసిన ధర్నా ఎత్తుగడ వికటించింది. పోలీసులు పకడ్బందీ వ్యూహంతో ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు జరగకుండా అడ్డుకున్నారు. ఇరు పార్టీల నాయకులకు నోటీసులు ఇచ్చి గృహాలకే పరిమితం చేశారు. దర్శి పట్టణంలో 144 సెక్షన్ విధించి ప్రజలు గుంపులుగా తిరగకుండా ఆంక్షలు విధించారు. అదనపు బలగాలతో కవాతు నిర్వహించారు. సాయంత్రం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగియటంతో పోలీసులు, ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. తొలుత ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, అందుకు నిరసనగా మగళవారం ధర్నా చేస్తామని సోమవారం రాత్రి ప్రకటించారు. దీనికి ప్రతిగా టీడీపీ నాయకులు కూడా స్పందించారు. టీడీపీ కార్యకర్తలపై దాడులు చేసి గాయపరిచి ఆస్పత్రి పాల్జేసిన వైసీపీ గూండాలపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావులు సీఐ వై రామారావుకు వినతిపత్రం సమర్పించారు. ఉపేక్షిస్తే తామూ ఆందోళనకు దిగాల్సి వస్తుందన్నారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దర్శిలో నివాసం ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు ముఖ్యమైన నాయకులకు నోటీసులు ఇచ్చారు. అనుమతి లేనందున ధర్నా చేయరాదని, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గుంపులుగా ఇంటి నుంచి బయటకు రాకూడదని నోటీసులు ఇచ్చారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యతో పాటు పలువురు టీడీపీ నాయకులకు కూడా పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఇతర గ్రామాల నుంచి ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు రాకుండా పట్టణంలోకి రాకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో ఇరు పార్టీలకు చెందిన నాయకులు గృహాలకే పరిమితమయ్యారు. సాయంత్రం వరకు పోలీసులు పట్టుసడలకుండా వ్యవహరించటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా వివాదం ముగిసింది.

టీడీపీ నాయకులపై దాడులు చేసిన వైసీపీ గూండాలపై చర్యలు తీసుకోవాలి

టీడీపీ నాయకులు, కార్యకర్తలపై మొన్నటి ఎన్నికల సందర్భంగా ఆతర్వాత దాడులు చేసిన వైసీపీ గూండాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ డిమాండ్ చేశారు. ఎన్నికల రోజున బొట్లపాలెంలో టీడీపీ కార్యకర్తలపై దాడిచేసి గాయపర్చారని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తనను దుర్భాషలాడి దాడికి ప్రయత్నించారని, అదేవిధంగా దర్శి-కురిచేడు రోడ్డులోని ఎన్ఏపీ కార్యాలయం పోలింగ్ బూత్‌లోకి అభ్యర్థిని అయిన తనను వెళ్లకుండా అడ్డుకొని రాళ్లతో దాడిచేసి దుర్భాషలాడారని లక్ష్మీ చెప్పారు. కొత్తరెడ్డిపాలెంలో ప్రచారం చేయకుండా అడ్డుకున్నారని, గణేష్ నిమజ్జనం సందర్భంగా డీజే బాడుగకు వెళ్లిన దళిత యువకులు టీడీపీ సానుభూతిపరులన్న అక్కసుతో దాడి చేశారని తెలిపారు. ఈ సంఘటనల్లో నిందితులైన వైసీపీ గూండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు వైసీపీ నాయకులు అబద్ధపు ప్రచారంతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టటం శోచనీయమన్నారు. ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని ఆమె చెప్పారు.

ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులు

ఎమ్మెల్యే బూచేపల్లి

వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి పోలీసులు ఇబ్బంది పెడుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. దర్శిలోని ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ తాము శాంతియుతంగా ఆందోళన చేయాలని భావిస్తే పోలీసులు అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తామన్నారు. వైసీపీ కార్యకర్తలకు అండగా నిలచి కాపాడుకుంటానన్నారు. భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.

పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్‌పై గోప్యం

ఉత్తర్వులు బయటపెట్టేందుకు విముఖత

నివేదికను కలెక్టర్‌కు పంపామన్న డీపీవో

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 17 : జిల్లాలోని ఇరువురు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేసినా ఆ విషయాన్ని బహిర్గతం చేయకుండా గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సింగరాయకొండ పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య, మద్దిపాడు మండలం దొడ్డవరప్పాడు కార్యదర్శి శ్రీనివాసులును మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారు. అయితే ఈ విషయం బహిర్గతమైనా డీపీఓ అధికారులు మాత్రం అదేమీ లేదని చెప్పడం విశేషం. సింగరాయకొండ పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య అనధికారికంగా ఫోన్‌పేకు పంచాయతీ డబ్బులను పంపుకున్నారు. దీనిపై మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేయడంతో అతనిపై విచారణకు ఆదేశించారు. విచారణాధికారులు రూ.79వేల పంచాయతీ నిధులను తన ఫోన్‌పేకు పంపుకున్నట్లు నివేదించారు. అయితే ఆ నివేదికపై సత్వరమే చర్యలు తీసుకోవాల్సి ఉన్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. ఎట్టకేలకు మంగళవారం అందుకు సంబంధించిన నివేదికను కలెక్టర్ అన్సారియాకు చేరడంతో సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. మరోవైపు మద్దిపాడు మండలం దొడ్డవరప్పాడు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పంచాయతీ తీర్మానం లేకుండా రూ.7.30 లక్షలతో పలు పనులు చేపట్టి నిధులు డ్రా చేశారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో విచారణకు ఆదేశించారు. అయితే పంచాయతీ తీర్మానాలు లేకుండా పనులు చేసినట్లుగా విచారణాధికారులు నివేదిక ఇవ్వడంతో సస్పెండ్ చేసినట్లు తెలిసింది. అయితే ఈ విషయంపై జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణిని సింగరాయకొండ పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య సస్పెన్షన్‌పై వివరణ కోరగా విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపినట్లు తెలిపారు. ఒకవైపు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేసినా ఆ ఉత్తర్వులను బయటపెట్టకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కలెక్టర్ తమీమ్ అన్సారియా



విద్యార్థులకు నులిపురుగుల మందు వేస్తున్న కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 17 : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం ఆవిష్కృతమవుతుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. దానిపై విద్యార్థి దశ నుంచే పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు కలెక్టర్ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వారు 5,96,751మంది ఉన్నారన్నారు. వీరికి 2,849 అంగన్‌వాడీ కేంద్రాలు, 2,718 పాఠశాలలు, 233 కళాశాలలు, 95 ఇతర వృత్తి విద్యాసంస్థలలో ఈ మాత్రలను ఇచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలోని 64 పీహెచ్‌సీలు, 18 యూహెచ్‌సీలు, ఎనిమిది సామాజిక ఆరోగ్య కేంద్రాలు, రెండు ఏరియా ఆస్పత్రులు, రెండు జిల్లా ఆస్పత్రులలో ఈ మాత్రలు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలోని పిల్లలు, టీనేజ్ వారందరికి ఖచ్చితంగా ఈ మాత్రలు అందేలా కార్యచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్‌కుమార్, ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ భగీరథి, డీఐఓ డాక్టర్ పద్మజ, డీపీఎంఓ వాణిశ్రీ, ఒంగోలు మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మనీష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

జిల్లాకు ఐదు కొత్త కేజీబీవీలు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 17: జిల్లాకు ప్రస్తుత విద్యా సంవత్సరానికి కొత్తగా ఐదు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు మంజూరయ్యాయి. ఈ మేరకు సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి. శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి కొత్తగా రాష్ట్రానికి 38 కేజీబీవీలు రాగా అందులో జిల్లాకు ఐదు మంజూరు చేశారు. దొనకొండ జడ్పీ హైస్కూలు, పెద్దారవీడు మండలం ఏనుగులదిన్నెపాడు, సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లె, కొత్తపట్నం జడ్పీ హైస్కూల్, తాళ్ళూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ టైప్-4 కేజీబీవీలను ఏర్పాటు చేస్తారు. ఒక్కో కేజీబీవీకి రూ.10లక్షల చొప్పున రూ.50లక్షలు విడుదల చేశారు. ఆయా పాఠశాలల్లో హాస్టల్ ఏర్పాటు చేసే భవనాల మరమ్మతులు, ఎలక్ట్రికల్ పనులు, పారిశుధ్య పనులు తదితరాలకు ఈ నిధులను వినియోగిస్తారు. ఈ పాఠశాలలకు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న బాలికలకు ఈ టైప్4 కేజీబీవీల్లో వసతి కల్పిస్తారు. మాములు కేజీబీవీల్లా కాకుండా ఇక్కడ విద్యార్థినులకు కేవలం హాస్టల్ వసతి మాత్రమే కల్పిస్తారు. దూరప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే బాలికల కోసమే వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

ఈ పంట నమోదు గడువు పెంపు

ఒంగోలు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ఈపంట నమోదు గడువును ఈనెల 23 వరకు ప్రభుత్వం పెంచింది. తొలుత ఈ నెల 15 నాటికే నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని వ్యవసాయ శాఖను ఆదేశించింది. తదనుగుణంగా జిల్లాలో ఈనెల 10 నాటికే సాగైన విస్తీర్ణంలో 90 శాతం విస్తీర్ణానికి సంబంధించి ఈ పంట నమోదును ఆ శాఖ సిబ్బంది పూర్తిచేశారు. అయితే కీలకమైన వీఆర్వో గుర్తింపు, గ్రామస్థాయి వ్యవసాయ శాఖ అసిస్టెంట్(వీఏఏ) ద్వారా సాగుదారు కేవైసీ కార్యక్రమాలు 75శాతం మేర పూర్తయ్యాయి. అయితే పలు జిల్లాల్లో వరదల కారణంగా ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో ఈ పంట నమోదు గడువును ప్రభుత్వం పెంచింది. ఆ ప్రకారం ఈనెల 23 వరకు ఈ పంట నమోదుతోపాటు కేవైసీ ప్రక్రియను కూడా పూర్తిచేయాలి. అలా పూర్తి చేసిన సాగుదారుల జాబితాలను ఈనెల 24 నుంచి 27 వరకు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో ప్రకటించాలి. వాటిపై వచ్చిన అభ్యంతరాలను 28, 29 తేదీల్లో పరిష్కరించి తుది జాబితాలను ఈనెల 30న ప్రకటిస్తారు. ఆ మేరకు షెడ్యూల్‌ను సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వగా తదనుగుణంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని డీఏఓ శ్రీనివాసరావు కోరారు.

రహదారులు అధ్వానం..ప్రజలకు నరకం

- ఏళ్లుగా లేని మరమ్మతులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరు
- వానపడితే వాహనచోదకులకు అవస్థలే



గుంతలమయమైన పర్చూరు - ఇంకొల్లు రోడ్డు

పర్చూరు, సెప్టెంబరు 17 : వైసీపీ పాలనలో పట్టణ, గ్రామీణ రహదారులు అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఏ రోడ్డు చూసినా అధ్వానంగా మారాయి. దీంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. ప్రధాన రహదారులు సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎక్కడ చూసినా రోడ్లు గుంతలమయం కావడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరిగి ప్రణాలు కోల్పోతున్నా పట్టించుకున్నవారే కరువయ్యారు.



ఛిద్రమైన దగ్గుబాడు - ఇంకొల్లు రోడ్డు

పర్చూరు నుంచి ఇంకొల్లు వెళ్లే (పాత మద్రాసు రోడ్డు) పరిస్థితి దయనీయంగా మారింది. గోతులు, ఎత్తుపల్లాలు, గులక రాళ్లు లేచి రోడ్డు అధ్వానంగా మారింది. ఈమార్గంలో రాకపోకలు సాగించాలంటే వాహన దారులకు కత్తిమీద సాము అన్న విధంగా పరిస్థితి ఉంది. పర్చూరు మండలం ఉప్పుటూరు నుంచి చెరుకూరు మీదుగా వెళ్లే రోడ్డు పరిస్థితి ప్రమాదకరంగా మారింది. పర్చూరు నుంచి గుంటూరు వెళ్లే రోడ్డులో అడుసుమల్లి మద్ద రోడ్డు బాగులేకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరుచేరడంతో గోతుల రోడ్లపై ద్విచక్రవాహనదారులు పట్టుతప్పి పడిపోతున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

దారుణం బల్లికురవ - మార్టూరు రోడ్డు

- నాలుగు కిలోమీటర్లు ఛిద్రం
- కొత్త వ్యక్తులు వస్తే వారి వాహనాలు పోయినట్లే
- గోతులతో దెబ్బతింటున్న కార్లు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



1. పెద్ద పెద్ద గుంతలతో అవస్థలు పడుతున్న వాహనచోదకులు
2. బల్లికురవ- మార్టురు అర్అండ్‌బి రోడ్డులో మోకాటి లోతు గోతులలో నిలిచిన వర్షపు నీరు
3. నక్కబొక్కలపాడు సమీపంలో ఉన్న మలుపులో గోతుల్లో వేసిన గ్రానైట్ వ్యర్థాలు (ఫైల్)

బల్లికురవ : బల్లికురవ - మార్టూరు ఆర్అండ్‌బీ రోడ్డు నరకప్రాయంగా మారింది. ఆ రోడ్డున ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రయాణించారంటే అంటే వారి వాహనాలు పోయినట్లే. మోకాటి లోతు గోతులలో ఇరుక్కు పోయిన వాహనాలతో ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు. నాలుగు కిలోమీటర్ల ప్రయాణం నరకం కనిపిస్తుందని వాహనచోదకులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వాలు మారిన రోడ్డు మాత్రం బాగు పడడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బల్లికురవ-మార్టూరు ఆర్అండ్‌బీ రోడ్డు మెత్తం 10కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రోడ్డులో 2019కి ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం 6కిలోమీటర్ల సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా అభివృద్ధి పరిచింది. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో మిగిలిన నాలుగు కిలోమీటర్ల రోడ్డుపై తట్టెడు మట్టిని కూడా వేసిన దాఖాలాలు లేవు. దీంతో ఇప్పుడు ఈ రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. మోకాటి లోతు గోతులు పడడంతో వాటిలో నీరు నిలిచి వాగులను తలపిస్తున్నాయి. ప్రతి రోజు ప్రజలు ప్రమాదాలబారిన పడుతున్నారు. నిత్యం వందలాది గ్రానైట్ లారీలు రవాణా చేసే ఈ రోడ్డును ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నక్కబొక్కలపాడు, నాగరాజుపల్లి గ్రామాల మధ్య తారు రోడ్డు మెత్తం మట్టి రోడ్డుగా మారిందని, గోతుల నిండుగా వర్షపు నీరు ఉందని దీంతో రాకపోకలు సాగించాలంటే నరకమేనని వాహనచోదకులు వాపోతున్నారు. బల్లికురవ. సంతమాగులూరు మండలాలకు చెందిన ప్రయాణికులు నిత్యం ఈ రోడ్డు మీదుగానే రాకపోకాలు సాగిస్తుంటారు. గోతులు పెద్దవిగా ఉన్న ప్రాంతంలో కొందరు ట్రాక్టర్లపై వ్యర్థ రాళ్లను తెచ్చి పడవేసి పోతున్నారని ఈ రాళ్లతో రాత్రుళ్లు ప్రమాదాలు పొంచి ఉన్నాయని వాహన చోదకులు అంటున్నారు. వర్షాలు కురిస్తే ఈ రోడ్డు అంటే వణుకు పుడుతుందని వారు తెలిపారు. నాలుగు కిలోమీటర్ల ప్రయాణం గంట పడుతుందని ఎంతో జాగ్రత్తగా వాహనాలను నడపకుంటే ప్రమాదాలు జరుగుతున్నాయని వారు తెలిపారు. అధికారులు వెంటనే ఈ రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మండపానికి రూ.లక్ష విరాళం

అద్దంకి, సెప్టెంబరు 17 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి మండపం నిర్మాణానికి పంగులూరు మండలం చందలూరుకు చెందిన అజిత్‌కుమార్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు లక్ష రూపాయల చెక్కును మంగళవారం ఈవో, అసిస్టెంట్ కమిషనర్ సుభద్రకు అందజేశారు.



పి.గుడిపాడులో తాళాన్ని అందిస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్

నిరుపేదలకు ప్రధాని ఆవాస్ గృహాలు



కొమ్మినేనివారిపాలెంలో ఇంటి పత్రాలను అందజేస్తున్న యువనేత కమల్‌కిషోర్

బల్లికురవ, సెప్టెంబరు 17 : అర్హులైన నిరుపేదలందరికీ ఎలాంటి చెల్లింపులు లేకుండా ప్రధాన మంత్రి అవాస్ యోజన ద్వారా ఉచితంగా గృహాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని అద్దంకి నియెజకవర్గ టీడీపీ పార్టీ యువనేత గొట్టిపాటి కమల్ కిషోర్ (బాబీ) పేర్కొన్నారు. మంగళవారం మోదీ పుట్టినరోజు సందర్భంగా ప్రధాన మంత్రి అవాస్ యోజన గ్రామీణ్ పథకంలో భాగంగా గృహ ప్రవేశ మహోత్సవాలు జరిగాయి. ఈసందర్భంగా మండలంలోని నక్కబొక్కలపాడు, కొమ్మినేనివారిపాలెం గ్రామాలలో నిరుపేదలైన జంగ్రాజుపల్లి యేబు, కీర్తిపాటి ఏడుకొండలకు మంజురైన ఇల్లు పూర్తికాగా గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువనేత కమల్‌కిషోర్ గృహాలను ప్రా రంభించి అనంతరం పేదలకు ఇంటి పత్రాలను సీట్లను అందజేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ అర్హత ఉండి ఇల్లు లేని వారు ఉంటే వెంటనే ఏఈని సంప్రదించాలని, వారికి ప్రభు త్వం ద్వారా గృహాలను మంజురు చేయిస్తామన్నారు. అనంతరం ఉన్నత పాఠశాల ఆవరణలో బాబీ మొక్కలను నా టారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు మలినేని గోవిందరావు, ఎం పీపీ శ్రీలక్ష్మి, ఎంపీడీవో రాంబాబు, గృహ నిర్మాణ శాఖ ఏఈ దర్గా రమేష్, సర్పంచ్ దూళిపాళ్ల బుల్లిరామయ్య, టీడీపీ నేతలు హనుమంతురావు, వేణుబాబు, శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ బ్రహ్మయ్య సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేదరమెట్ల : ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని పి.గుడిపాడులో నిర్మించిన ఇంటిని ఎంపీడీవో, తహసీల్దార్ మెహతాజ్ ప్రారంభించారు. మండలంలో 215 ఇళ్లు మంజూరు కాగా, 41 ఇళ్లుపూర్తి అయినట్లు సురేష్‌బాబు తెలిపారు. పి.గుడిపాడులో 30 ఇళ్ల మంజూరు కాగా 8 ఇళ్లు పూర్తి అయ్యాయన్నారు. ఇంటి తాళాలు అందజేసే కార్యక్రమానికి మండలంలోని అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఏపీవో కోటేశ్వరి, హౌసింగ్ ఏఈ నటరాజ్, ఏపీఎం అనూరాధ, టీడీపీ నాయకులు జాగర్లమూడి జయకృష్ణ, మేదరమెట్ల శ్రీనివాసరావు, కోట్ల రవీంద్ర, మందా నాగేశ్వరావు, మందా ఆమోస్ పాల్గొన్నారు.

అద్దంకి : పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఏఎంసీ మాజీ ఛైర్మన్ నాగినేని రామకృష్ణ అన్నారు. మండలంలోని శింగరకొండపాలెంలో పీఎంఏవై గ్రామీణ స్కీమ్ కింద నిర్మించిన గృహాల గృహ ప్రవేశ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో దేవసేనకుమారి, హౌసింగ్ ఏఈ కిరణ్, ఆర్ఐ శంకర్, పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌వలి, టీడీపీ నేతలు కరి పరమేష్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా మోదీ పుట్టినరోజు వేడుకలు

చినగంజాం : మండలంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజు వేడుకలు బీజేపీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. చుండిబజారులోని వాల్మీకి సేవా సంఘంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఉలిచి ఏసుబాబు మాట్లాడుతూ మోదీ సేవలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు మోటుమర్రి వెంకటేశ్వరరావు, అనుమాలశెట్టి శ్రీనివాసరావు, నూనె సత్యనారాయణ, సరాలశెట్టి చిన సుబ్బారావు, భారత్ నిర్మాణ్ వలంటీర్ గోవిందస్వామి, వాల్మీకి సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు : ఇందిర కాలనీలో ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన పథకం ద్వారా ఇంటి నిర్మాణం పూర్తిచేసుకున్న లబ్ధిదారులకు మంగళవారం తాళాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, గ్రామపార్టీ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, నాయకులు కొల్లా శివరాం ప్రసాద్, రాష్ట్ర నాయకుడు కోడూరి శేషబ్రహ్మచారి, చెరుకూరి శ్రీధర్(చింపయ్య), షేక్ హుస్సేన్, బంగారుబాబు, కిషోర్, ఖాజావలి, గౌస్, హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ కుమార్, కార్యదర్శి సుధీర్ పాల్గొన్నారు.

ఇంకొల్లు : ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల గృహప్రవేశాలు మంగళవారం నిర్వహించారు. మండలంలో 1024 మంజూరు కాగా, 167 ఇళ్లు నిర్మించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్యలక్ష్మి, తహసీల్దార్ ప్రమీల, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, నాయకులు కరి శ్రీనివాసరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుంజి వెంకట్రావు, ఎంపీటీసీ మాజీ సభ్యులు శాంతి పాల్గొన్నారు.

అద్దంకి : ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం అద్దంకిలో బీజేపీ శ్రేణులు పలు కార్యక్రమాలను నిర్వహించారు. శింగరకొండ రోడ్డులోని చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో కేక్ కట్ చేశారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. అంబేడ్కర్ బొమ్మ సెంటర్‌లో కేక్ కట్ చేశారు. కార్యక్రమాలలో బీజేపి జిల్లా ఇన్‌చార్జి పులి వెంకటకృష్ణారెడ్డి, మండవ రామకృష్ణ, పర్చూరు శ్రీనివాసరావు, యలమందరావు, శ్రీరామ్, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, కాలేషాబాబు విరాట్, కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోటరీ సేవలు అభినందనీయం

ఇంకొల్లు, సెప్టెంబరు 17 : మండలంలోని ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు, చిలకలూరిపేట వారు అందిస్తున్న సేవలు అభినందనీయని పలువురు అన్నారు. ఈ రెండు క్లబ్‌లు సంయుక్తంగా పాఠశాలకు సుమారు రూ.150000 విలువైన 45 బల్లలను బహూకరించారు. అందులో పాఠశాల కరెస్పాండెంట్ గోరంట్ల పున్నయ్య 25శాతం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మార్టూరు క్లబ్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, క్లబ్ సెక్రటరీ సాంబశివరావు, సీనియర్ రొటేరియన్ మోహనరావు, ఆంజనేయులు, అంకమ్మచౌదరి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

చినగంజాం, సెప్టెంబరు 17 : మండలంలోని కడవకుదురు గ్రామంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వారు ఉచిత వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. గ్రామంలోని శివాలయం సెంటర్‌లోని కీర్తి మెడికల్స్ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జికూటమ్ షేక్ రఫీ తెలిపారు. వైద్య శిబిరంలో పలు రకాల వ్యాధులకు సంబంధించిన 200 మందికి డాక్టర్ రామాంజనేయులు వైద్య పరీక్షలు చేశారు. కంటి సంబంధిత పరీక్షలను ఆప్తమాలజిస్ట్ సునీల్ నిర్వహించారు. ఈసీజీ, బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. పరీక్షల అనంతరం 55 మందిని ఒంగోలు హాస్పిటల్‌కు రిఫర్ చేసినట్లు రఫీ తెలిపారు. ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, ఈహెచ్ఎస్ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రాథమిక వైద్యులు పూర్ణచంద్రరావు, కీర్తి మెడికల్స్ నిర్వాహకులు మద్దసాని రాఘవరావు, కిమ్స్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ఇసుక ట్రాక్టర్ వద్ద ఎస్ఐ వెంకటేశ్వర్లు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 17 : మండలంలోని పందిళ్లపల్లి పరిధిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, డ్రైవర్లను వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో కలసి మంగళవారం పట్టుకున్నారు. ఈ ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు సంబంధించి ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

గడ్డివాము దగ్ధం

చీరాలటౌన్, సెప్టెంబర్ 17 : చీరాల పరిధిలోని హరిప్రసాద్‌నగర్‌కు చెందిన కొత్తగొర్ల శ్రీనివాసరావుకు సంబంధించిన 10 ఎకరాల గడ్డివాము మంటల్లో ఆహుతి అయింది. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. అయితే ఎవరైనా నిర్లక్ష్యంగా సిగరెట్ వంటివి విసిరిన కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. విషయం తెలియగానే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. రూ.1.80 లక్షలు నష్టం జరిగిందని యజమాని తెలిపాడు.



మాత్రలను మింగిస్తున్న వైద్యాధికారి

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

అద్దంకిటౌన్, సెప్టెంబరు 17 : నులిపురుగుల నివారణ ద్వారా రక్తహీనతను నివారించవచ్చని ఎంపీహెచ్‌ఈవో నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మోదేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో తిమ్మాయపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ప్రతి 6 నెలలకోసారి ఈ నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలన్నారు. మండలంలో మొత్తం 4750 మందికి గాను 4612 మందికి మాత్రలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం పురుషోత్తమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు అబ్దుల్ సత్తార్, ఏఎన్ఎంలు భారతి, సుదీక్షణకుమారి, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు. కెఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాత్రలు పంపిణీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి. రామ్‌మోహనరావు తెలిపారు.

చినగంజాం : నులిపురుగుల నివారణ దినం సందర్భంగా మండల పరిధిలోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బంది పంపిణీ చేశారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఎంపీడీవో కే.స్వరూపరాణి, సంతరావూరు ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హిమబిందు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. విద్యార్థులలో రక్తహీనత లేకుండా ఉండేందుకు ఈ మాత్రలు ఉపయోగపడతాయని తెలిపారు. 271 మంది విద్యార్థినులతో మాత్రలు మింగించినట్లు ఎంఈవో-1 బి.అజయ్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎస్‌వీజీ.కృష్ణమూర్తి, జూనియర్ అసిస్టెంట్ నక్కల వేణు, చినగంజాం గ్రామ సచివాలయ-2 కార్యదర్శి సుబ్బారావు, ఏఎన్ఎం ఎం.స్టాన్లీదేవి, చినగంజాం, సంతరావూరు పీహెచ్‌సీ పరిధిలోని వైద్య సిబ్బంది, కేజీబీవీ, సంతరావూరు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంగులూరు : నులిపురుగులు నివారించి రక్తహీనత నుంచి పిల్లలను కాపాడేందుకు ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని వైద్య పర్యవేక్షకులు హరిబాబు, అనూరాధ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ చిన్నారులకు మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలు మింగించే కార్యక్రమాన్ని చేపట్టారు. చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు వయస్సు గల వారికి ఆరు నెలలకో ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం ద్వారా నులిపురుగులు నివారించవచ్చన్నారు. మండలంలోని 14 సచివాలయాల పరిధిలోని 21 గ్రామ పంచాయతీలలో 4,316 మంది బాల బాలికలకు ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, ఏఎన్ఎం జానకి, రామాంజమ్మ పలు గ్రామాల ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యంతో ముందుకు సాగాలి

చీరాలటౌన్, సెప్టెంబరు 17 : విద్యార్థి దశ నుంచే లక్ష్యంతో ముందుకు సాగాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో పుల్లగూర జయరావు, సలగల ఇజ్రాయేలు మెమోరియల్ స్ఫూర్తి పురస్కారాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల జరిగిన ఐపీఈ పరీక్షల్లో ఉన్నతంగా రాణించిన నలుగురు పేద విద్యార్థులకు అందరికి కలిపి రూ.10 వేల సాయాన్ని అందించారు. దాతలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగరరావు, విశ్రాంతి ఉద్యోగి పుల్లగూర జయశీలరావు, కళాశాల ప్రతినిధులు పుష్పరాజ్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పెరియార్ రామస్వామికి నివాళి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 17 : అద్దంకిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో మంగళవారం పెరియార్ రామస్వామి నాయకర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమానికి బుద్దిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్ళూరి బాబూరావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్ బాబు, వివిధ పార్టీల నాయకులు పులిపాటి హేబేలు, మందా జోసఫ్, వెంకటేష్, అంకయ్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

అద్దంకి, సెప్టెంబరు 17 : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఆర్టీసీ అద్దంకి డిపో మేనేజర్ బెల్లం రామ్మోహనరావు అన్నారు. స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాలలో భాగంగా మంగళవారం ప్రజా రవాణా విభాగం ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి అంబేడ్కర్ బొమ్మ వరకు తిమ్మాయపాలెం హైస్కూల్ విద్యార్థులు, ఆర్టీసీ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ డీఎం మహబూబీ, కొండలు, యోగా శిక్షకులు శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అద్దంకి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో పరిశుభ్రం చేయించారు.

కేఆర్‌కేలో ఓజోన్ దినోత్సవం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 17 : కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జీవశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఓజోన్ దినోత్సవ ప్రాముఖ్యతను, విద్యాలయాల, పర్యావరణ సమతుల్యతను వ్యక్తిగత కృషిని అధ్యాపకులు ఎస్‌కే మస్తాన్‌వలి, వి.రామకృష్ణ, అశోక్‌కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాజశేఖర్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

- పూజ్యనీయుడు
- ఎమ్మెల్యే కొండయ్య



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 17 : విరాట్ విశ్వకర్మ అనునిత్యం పూజ్యనీయుడని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. పాపరాజుతోట బాపనమ్మ కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన విశ్వకర్మ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ విశ్వకర్మను నాగరికతకు మూలపురుషునిగా అభివర్ణించారు. నియోజకవర్గ ప్రజల అభ్యున్నతికి విశ్వకర్మ ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. విశ్వబ్రాహ్మనులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అం డగా ఉంటామన్నారు. కార్యక్రమంలో విశ్వక ర్మ కమిటీ సభ్యులు, సంఘీయులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేరాలలోని ది పేరాల పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీహాలులో మంగళవారం విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వకర్మ విగ్రహానికి పూలమాలలువేసి నమస్కరించారు. ఈ సందర్భంగా పలువురు సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ ఐకమత్యంగా ముందుకు సాగాలన్నారు. అప్పుడే మన హక్కులను మనం సాధించుకోగలుగుతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొర్రెపాటి ప్రభాకర్ విశ్వకర్మ, జిల్లా అధ్యక్షుడు కడలి జగదీష్‌కుమార్, వి.శివనాగేశ్వరరావు, పి.శివాంజనేయప్రసాద్, పిచ్చియాచార్యులు, వీరభద్రుడు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : అద్దంకిలోని కమలేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాయజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమంలో 21 మంది దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీచరణ్, టీడీపీ నాయకులు కాకాని అశోక్, పూర్ణచంద్రరావు, రామారావు, త్రిమూర్తులు, ప్రకాశం జిల్లా కార్పెంటర్ అధ్యక్షుడు రామకృష్ణ, బాపట్ల జిల్లా సెక్రటరీ నరసింహచారి, రత్నాచారి, మల్లికార్జున్, ఆంజనేయులు, నాగేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి



చినగంజాంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

చినగంజాం, సెప్టెంబరు 17 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో కే.స్వరూపరాణి, టీడీపీ సీనియర్ నాయకురాలు యార్లగడ్డ లక్ష్మి అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం జరిగిన పలు కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని ఎంపీడీవో సూచించారు. కడవకుదురులో పీఎంఏవైజీ గృహాలు, పీఎంఏవై అర్బన్ గృహాల గృహప్రవేశ కార్యక్రమాల్లో అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కడవకుదురు గ్రామ సర్పంచ్ గొల్లమూరి శివకుమారి, ఈవోపీఆర్డీ ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తి, హౌసింగ్ ఏఈ జి.రాజశేఖర్, గ్రామ కార్యద ర్శులు ఎన్.సూర్యనారాయణ, కృపారావు, మండల ఎంఆర్‌సీ నున్నం అశోక్‌కుమార్, తెలుగు యువత నాయకులు దేవతోటి నాగరాజు, ఆయా గ్రామాల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బల్లికురవ : సమాజంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజలు సహకరించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రాంబాబు కోరారు. మంగళవారం బల్లికురవలో స్వచ్ఛత హీ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న వ్యర్థాలను అధికారులు తొలగించారు. అనంతరం పిచ్చి మొక్కలను పీకేశారు. ఈసందర్భంగా నాలుగు రోడ్ల కూడలిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే అంటు వ్యాధులు దరి చేరవని తెలిపారు. ఈ ర్యాలీలో ఎంపీపీ శ్రీలక్ష్మి, ఈవోపీఆర్డీ సుమతి, సీనియర్ అసిస్టెంట్ సీహెచ్‌వై కోటేశ్వరరావు (బుజ్జి) పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : స్వచ్ఛత, పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో సురేష్‌బాబు అన్నారు. మంగళవారం మేదరమెట్లలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అక్టోబరు 2 వరకూ కార్యక్రమాలు కొనసాగించాలని ఆదేశించారు. మేదరమెట్లలోని రోడ్డు వెంట చెట్లు తొలగించడం, బ్లీచింగ్ వంటి పనులను చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ బొనిగల ఎలిశమ్మ, ఉప స ర్పంచ్ మన్నె దుర్గారావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మికాంత్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే



పాత బస్టాండ్ సెంటర్‌లో ఇలా

అద్దంకి, సెప్టెంబరు 17 : అద్దంకి పట్టణంలో పలు ప్రాంతాలలో చెత్త, వ్యర్థాలు తొలగించడంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తుండడంతో కంపుకొడుతోందని స్థానికులు వాపోతున్నారు. పాత బస్టాండ్ సెంటర్‌లో మెడికల్ షాపుల పక్కన ఉన్న రోడ్డు లో గత 5 నెలలుగా మురుగు కాలువల్లో పూడిక తీయలేదు. కనీసం కాలువలలో ఉన్న చెత్తా చెదారాన్ని కూడా తొలగించకపోవడంతో మురుగు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు అంటున్నారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు కాలువల్లో పేరుకున్న చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నష్టాన్ని మిగిల్చిన వాయుగుండం

- నీట మునిగిన మినుము
- ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రభుత్వం ఆమోదం



నారు మడులకు నీళ్లు పెడుతున్న రైతు



నష్టపోయిన మినుముపైరును పరిశీలిస్తున్న అధికారులు

చీరాలటౌన్, సెప్టెంబరు 17 : వాయుగుండం కారణంగా కురిసిన భారీ వర్షాలు రైతులకు నష్టాన్ని మిగిల్చింది. చీరాల మండల పరిధిలో ఈ నెల మొదటి వారం, నెలాఖరులో కురిసిన కుండపోత వర్షాలకు రైతులు బెంబేలెత్తారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి 300 ఎకరాలు, వేరుశనగ 308 ఎకరాలు, మినుము 74 ఎకరాలలో సాగు అవుతోంది. సాధారణ విస్తీర్ణం 1664 నమోదై ఉండగా ప్రస్తుతం 682 ఎకరాల్లో మాత్రమే సాగులో ఉంది. వరద ప్రభావంతో ఆగస్టు 30వ తేదీన 18.4 మి.మీ. 31వ తేదీన 73.1మి.మీలో వర్షపాతం నమోదయింది. అంతేకాకుండా సెప్టెంబరు 1న 81.4 మి.మీ. కుండపోత వర్షం కురుసింది. దీంతో ఈక్రమంలో బుర్లవారి పాలెం, వాడరేవు ప్రాంతాల్లో సాగులో ఉన్న 74 ఎకరాల మినుములో సుమారు 66.42 ఎకరాల పంట నష్టం జరిగింది. దీంతో 45 మంది రైతులు బోరున విలపించారు. ఆ సమయంలో వరి సాగుకు ఎద పెట్టిన వారి పరిస్థితి కూడా ప్రతికూలత సంతరించుకుంది. గడిచిన రెండు మాసాల్లో సుమారు 326 మి.మీ. సాధారణ స్థితి ఉండాల్సి ఉండగా సమపాళ్లు లేకుండా 241 మి.మీ మాత్రమే నమోదయి. నిరాశ మిగిల్చింది.

అధికారుల పరిశీలన

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో వ్యవసాయాధికారులు విస్తృతంగానే పర్యటించి నష్టాలపై అంచనా వేశారు. ఈక్రమంలోనే రైతన్నలకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.2.66.386 పరిహారానికి నివేదిక పంపగా అధికారుల నుంచి సానుకూల స్పందనే లభించింది. వాయుగుండ ప్రభావం వారంముందు సంభవించినట్లయితే వేరుశనగకు తీవ్ర నష్టం వాటిల్లేదని అధికారులు చెప్తున్నారు. ఎట్టకేలకు తిరిగి నారు మడులు, నాట్లతో మండలంలో పచ్చని పొలాలతో కళకళలాడుతున్నాయి. ఈ సారైనా రైతు ఆనందంతో సాగును పూర్తి చేయాలని ఆశిద్దాం.

రైతులకు ఈ-పంటతో మేలు



వరద ప్రభావంతో జరిగిన నష్టాన్ని అంచనా వేసి నివేదికను ఇప్పటికే అధికారులకు పంపాం. ఎకరాకు రూ.4 వేలు ఇన్‌పుట్ సబ్సిడీకు అవకాశం ఉంది. అలాగే రైతులు వారు సాగు చేసే పంటలను కచ్చితంగా ఈ పంట యాప్‌లో నమోదు చేసుకోవాలి. తద్వారా క్రయ విక్రయాలు, ఇన్స్‌రెన్స్, ప్రొక్యూర్‌మెంట్ వంటివి కలిసొస్తాయి. ఆగష్టు 5 నుండి సెప్టెంబర్ 23 వరకు మాత్రమే నమోదుకు అవకాశం ఉంది. నమోదు లేకపోతే అన్ని విధాలుగా రైతులకు భరోసా కోల్పోతారు.

- సుమతి, మండల వ్యవసాయాధికారి